గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# జూలై 2017
# కథలు




"   బాబూ !లేవరా!-ఈపాలూ త్రాగరా!.పాలూ త్రాగితే బలమూ ..వచ్చేనురా! ". [బాబూ లేవరాస్టైల్ ]

"అమ్మా !ఉండవే-   ఓ అమ్మా !ఉండవే -అమ్మా నిద్దరే –ఓ!అమ్మా !నిద్దరే.."{బాబూ లేవరాస్టైల్}

"మామంచి బాబువుకదూ ! పాలుత్రాగి మళ్ళా నిద్రపో -". గబగబా పాలుత్రాగి మళ్ళా దుప్పట్లో దూరాడు .కమలా , కరుణా కర్ల ఏకైక , ముద్దుల సంతానం ,లేకలేక కల్గినందున వాడ్ని అబ్బురంగా పెంచుకొస్తున్నారు.ఏడేళ్ళైనా , స్కూల్   మొగమెరు గడు. అందరూ ఎగతాళి చేస్తున్నారని , ఓరోజున వాడ్ని స్కూల్లో వేశారు.తల్లే చదువుకోను వెళ్తున్నట్లు రోజూ వాడితో వెళ్ళి, స్కూల్లో సాయంకాలం దాకా ఉండి వాడితోనే వస్తుంటుంది కమల ,' అలా పిల్ల వాడితో అంతసేపు ఉండరా 'దని టీచర్స్ చెప్పి నా వినక. అక్కడ వాడిముక్కు తుడవడం , దాహమేస్తే   నోటికి నీరు అందివ్వడం , అన్నం నోట్లో   పెట్టడం, సంచి సర్దడం అన్నీ ఆమే చేసేది.స్కూల్ పిల్లలకంతా అదో ' ఫన్ ' గా ఉండేది. అందరూ వాడ్ని 'అమ్మ కూచి వస్తూన్నాడని ' ఎగతాళిచేసేవారు. ఓరోజున స్కూల్ ఇన్స్ పెక్టర్   వచ్చి " అమ్మా! మీరు ఇంతసేపు తరగతిలో ఉండరాదు. మీబాబును వదలి వెళ్తుండండి." అని ఆదేసించిన మీదట కమల వాడ్ని వదలి రాసాగింది. వాడు ఇంటికి   రాగానే ఏడ్చేవాడు.

" ఎందుకూ ఏడుపూ ..ఏమాయె నీకూ - టీచరూ కొట్టెనా ? స్నేహితులు నవ్విరా! ?   చెప్పరా ఓతండ్రి ! అడుగుతా

నేవెళ్ళి.[కలవారికోడలూ కలికికామాక్షి స్టైల్} .

" అమ్మా! నిన్నింత సేపు చూడకుండా ఉఒడలేనే.." అని అమ్మ మెడవాటేసుకుని గట్టిగా ఏడ్చేవాడు. 'చూడాలని ఉందే అమ్మా ! చూడాలని ఉందే !

గంటల తరబడి ఉండలేనే !చూడాల ని ఉందే!

చెవులకు పాఠం పోనేపోదే !కంటికి బోర్డు కననే కనదే !-- !--[ చూడలని ఉంది అమ్మను చూడలనిఉంది స్టైల్] అని వాడు కమల స్లూల్ కు వెళ్ళడం మానాక గొడవచేసేవాడు. కమల వాడికి తన మీదున్న ప్రేమకు పొంగి పోయేది. తల్లి బిడ్డల ప్రేమ చూసి కరుణాకర్ కూడాఎంతో సంతోషించేవాడు. ఓరోజు స్కూల్ నుండి వస్తూనే ." పక్కింటి పిల్ల వాడ్నిచూశారా ! -వాళ్ళ నాన్న కొన్నా క్రికెట్ బ్యాటూ కాంచారా ?! " [పొరుగింటి మీనాక్షమ్మను..స్టైల్} " పక్కింటి వాళ్ళ బాబు పెద్దవాడు రా ! .వారి పిల్లడి తోటీ పోటీ మనకు వద్దేవద్దురా.." .తల్లి ఎంతగానో చెప్పి చూసినా , వాడు తన పట్టు వదలలేదు చివరకు ,తండ్రి కరుణాకర్ వాడికి క్రికెట్ బ్యాట్ కొని తెచ్చాకే వాడు తల్లి తిని పించే బువ్వ తిన సాగాడు. తల్లి వాడ్ని ముద్దులతో ముంచెత్తేది.

ఈవిధంగా ఆ 'అమ్మ కూచి' , ఐదోక్లాస్ పూర్తిచేసి ,హైస్కూల్ దాకా వెళ్ళాడు. అక్కడ క్లాస్ లో టీచర్స్ నోట్స్ చెప్పేప్పుడు ' వ్రాయలే 'నంటే, కమల వెళ్ళి వారిని రిక్వెస్ట్ చేసి , తోటి పిల్లల నోట్స్ తెచ్చి రాత్రంతా కూర్చుని వ్రాసి తెల్లవారి ,వారి నోట్ బుక్స్ తిరిగి ఇచ్చేసేది. మరో రోజున వాడు ఇంటికి రాగానే మూడంకేసి పడుకోగా , తల్లి--' నాబిడ్డ సంతసం -నా కెంతో ఆనందం - 'నాబిడ్డ కోసమూ - ఏమైనా చేయనా? '--[అన్నయ్య సన్నిధి-నాకదే పెన్నిధీ స్టైల్]. --అని వాడ్ని ఎంతో అడగ్గా , అడగ్గా -- ' ఏమే తల్లీ! ఏమని చెప్పుదునే నా జననీ! నాకుంకొంత సిగ్గాయనే! అందరి గృహములనుండ మనింట లేకన్ పోవుట బిడియంబుగాదే!

ఎంతవమానమో ఊహించ నాతరమా! నీతరమా!ఈ ఊరన్ మనకు, - కొనరే రంగుల దూరదర్శన్ ని ఒకదానిని మన మర్యాదన్ పెంపొందగా-[కారే రాజులు? రాజ్యముల్ కలుగవే? వరుస] అని తినక, తాగక, నిద్రించక సతాయించగా .. కమలమ్మ , కరుణాకరుకు నచ్చ చెప్పి , కలర్ టి.వి. అప్పు చేసి తెమ్మంది . కరుణాకర్ --' అప్పు చేసి కలర్ టి.వి వద్దే కమలా! ఇది మంచిపని కాదు మరి వినవే కమలా [ అప్పు చేసి పప్పు కూడు- స్టైల్] -ముద్దుల బిడ్డడికోసం కమల భర్తమాట వినలేదు..

చివరకు కరుణాకర్ కలర్ టి.వి. అప్పుచేసి తెచ్చాడు.అమ్మకూచి , అమ్మకొంగు పట్టి గిరగిరా తిరుగుతూ-- ' కలనిజ

మాయెగా -కలర్.టివి. వచ్చెగా , సాటివారి లోననేనూ సాదరంగా ఉంటా గా-- [ కలనిజ మాయెగా--స్టైల్]. కలర్.టి.వి--కొని తెచ్చాకే వాడు తల్లి చదివే పాఠాలు వినసాగాడు. ఆవిధం బెట్టి దనిన.. - పరిక్షలప్పుడేకాక , ప్రతిరోజూ కమలే పాఠాలు చదువుతుంటే వాడు పడుకుని వింటూ ఉండేవాడు. ఒక్కో సారిపాపం వాడు వింటూనే వున్నాడని ,ఆమె వాడు నిద్ర పోడం గమనించక ,చదువు తూనేవుండేది.

అందుకే వాడి హైస్కూల్ పాఠాలన్నీ ఆమె కు కంఠో పాఠాలయ్యాయి. అలా వాడి హైస్కూల్ చదువు పూర్తయింది. ' అమ్మ కూచి ' అనే పేరూ స్థిరమైంది. అమ్మా నాన్న లు పెట్టిన పేరు ఎవ్వరికీ తెలీనే తెలీదు. ఇహ కాలేజ్ లో చేరాల్సిన సమయం ఆసన్నమైంది." నిను చూడక నేనుండలేనూ -నను చూడక నివుండలేవు- ఈ బాధ లు ఎందుకు తల్లీ ?-ఇహ చదువులు వద్దే వద్దు.."[పాట] -అని తల్లిని వదలి ఉండలేనని చెప్పేశాడు ,అమ్మ కూచి గాడు. తండ్రి కరుణాకర్ -

" ఒరే !బాబూ ! ఈ హైస్కూల్ చదువుకు ఉద్యోగాలేం వస్తాయి చెప్పు.కొంచం కష్టపడి ఎలాగో డిగ్రీ చెయ్యి . ఏ బ్యాంక్ లోనో ఉద్యోగం సంపాదించవచ్చు. ఆతర్వాత ఓ మంచి పిల్లను తెచ్చి పెళ్ళిచేసేస్తాం " అని ఎంతగానో నచ్చ చెప్పాడు. దానికివాడు " చదువు లన్ని చదివి చావంగ నేటికి ? చావు లేని చదువు చదువ వలయు..'నాయనగారూ ! మీరేం బాధ పడకండి.అమ్మ చదువు తుండగావిని నేను భారత ,భాగవత పురాణాలన్ని పుక్కిట పడతాను. పురాణపురుషుడ్ని అవు తా ను.పెళ్ళంటారా! మనదేశంలో మగాడై తే చాలటగా పిల్లనిచ్చేవాళ్ళు వెంటపడతారనిమాస్నేహితులు చెప్పుకుంటుంటే విన్నాను." అని చెప్పాడు.

దానికి తండ్రి" ఆరోజులు పోయాయ్ నాయనా! ఇప్పుడు మగపిల్లాడే ఆడపిల్లను వెతుక్కుంటూ దొరికిందే చాలని కట్టేసుకోవాల్సి వస్తున్నది. నామాట వినుబాబూ!"అని ఎంత బ్రతిమాలినా ఊహూ వింటేగా, తండ్రి ఏమీ అన లేక " నుదుటన్ వ్రాసిన వ్రాతకన్న కలదే నూరేళ్ళు చింతించినన్..--నీఇష్టం నాయనా!" అని ,పురాణ గ్రంధాలన్నీ కొనితెచ్చి చ్చాడు. తల్లి మాత్రం ఆదేవుని మనస్సులో ప్రార్ధిస్తూనే --పురాణ కాలక్షేపం చేయసాగింది వాడొక్కడితోనే . తల్లిబాధచూడలేకవాడూనూ-'తల్లి బాధ చూడలేను- నాన్న మనసు కాదన లేను - బాధలేవొ నేనేపడతా - భగవాన్ సీటి ప్పించు- అమ్మనాన్న ఋణం తీర్చి - అమ్మకొడుకు ననిపిస్తా-[పాట] కాలేజ్ చదువు చదివే అవకాశం కల్పించమని మొక్కాడు.అమ్మకూచి ప్రార్ధన ఆ దేవుడు విన్నాడు..ఉన్న ఊరిలో నే కాలేజి వెలసింది . 'ఎంత గొప్ప ప్రార్ధనో -విన్న దేముడాల కించె - ఉన్న ఊరిలో ననే - కాలెజొకటి వెలసెనూ..[ఎంతఘాటు ప్రేమయో -స్టైల్ ] కమల, కరుణాకర్ల ఆనందం అంతా ఇంతాకాదు. ' ఆ నంద మానంద మాయెనే .. మాబిడ్డ కాలేజ్లో చేరెనే..'-అని పాడుకున్నారు. అలా ' అమ్మకూచి ' కాలేజ్ లో అడుగు పెట్ట డం ఓగొప్ప చిత్రంగా జరిగింది.పురాణ శ్రవణ పుణ్యఫలం వల్లనే ఈ చిత్రం జరిగిందని వారినమ్మకం .కాలేజ్ లో చేరినరోజే ఎలా తెల్సిందో గాని , అందరికీ ' అమ్మ కూచి ' విషయం తెల్సి పోయింది.అందరూ వాడ్ని ఆ నిక్ నేం తో నే పిలిచేవారు.-

పిలిస్తే పిల్చుకొ పోండి -లెక్కేచేయను- పోండి ..పోండోయ్ ..పోండోయ్ పోండి..[ పోండిరా పోండి కాలం ఖర్మంకలిసొస్తేనే --స్టైల్ ] - అని తన పని తాను చేసుకో సాగాడు.యధాప్రకారం తల్లి నోట్సులన్నీ వ్రాసి ఇచ్చేది. ఇంటర్ పూర్తయ్ ..' ఇంతింతై

వటుడింతై ..' అన్నట్లు మన ' అమ్మకూచి ' ,బి.ఏ .లో అడుగు పెట్టాడు. వాడి చదువేమో కాని, కమలమ్మకు పరిజ్ఞానం పెరిగింది.ఎరిగిన వారంతా ,ఆమెను ప్రోత్సహించగా,ఆమె ప్రైవేటుగా అప్లయ్ చేసి ,తానూ తన బిడ్డతోపాటుగా బి.ఏ. చదవసాగింది. కొడుకు కోసం టెక్స్ట్ బుక్సన్నీ చదివి చక్కనినోట్సు ప్రిపేర్ చేసేది కమలమ్మ , ఆనోట్స్ ఆమె చదివితే పడుకొని వినేవాడు ఆ గారాల బిడ్డ. శయనించు మాబాబు! శయనించవయ్యా !- శయనించి పాఠాలు శ్రవణించ వయ్యా !- నిదుర మాత్రము పోక -ఆలకించయ్యా!- నీ కొరకు పాఠాలు - నే చదువుతానూ!- [శేష శైలా వాస శ్రీవేంకటేశ -స్టైల్-] , పరీక్షలకు మాత్రం ఇద్దరూ ఒద్దికగా వెళ్ళేవారు. అమ్మతోపాటుగా , వాడికీ ఫస్ట్ క్లాస్ మార్కులు వస్తాయని అంతా అనుకున్నారు.కానీ పాపం వాడికి ఎప్పుడూ వ్రాయడమే అలవాటు లేనందున అత్తెసరు మార్కులతో బి.ఆ అయ్యాననిపించాడు.

కరుణాకర్ -- 'అయ్యో బిడ్డ డా! ఓరయ్యో బిడ్డడా! -ఫస్టు క్లాసులో పాసవుతావని -ఎంతో తలచితిరా! నేనెంతో నమ్మితిరా! --[పాట ]-అని బాధపడగా-, బిడ్డడు-- ' వగచకు వగచకు ఓనాన్న ! వద్దేవద్దయ్యా ! బాధొద్దే వద్దయ్యా !' [పాట ]-అని ఇంకా-- క్లాసు లో ఏముందిలే -మార్కులే నే తిందునా! --[పాట -]-అని తండ్రిని ఓదార్చాడు. కమలమ్మకు ఫస్ట్ క్లాస్ వచ్చి నందుకు కరుణకర్ కేమీ ఆనందం లేకపోగా , బిడ్డడి అత్తెసరు మార్కులతో,ఏం ఉద్యోగం వస్తుం దాని ఆలోచించ సాగాడు. ఎన్నెన్నో ప్రయత్నాలు చేసినా ఏమీ ఫలితం కానరాక , ఒక్కగానొక్క బిడ్డడికి ఉద్యోగం ,వివాహం చేసేస్తే , హాయిగా కాలుమీద కాలసుకుని , బిడ్డకు పుట్టిన బిడ్డలతో గడపవచ్చని తలంచారు , కరుణాకర్ దంపతులు.చివరకు --ఓఅర్ధరాత్రి -వారికి-- - 'తోచిందీ ఊపాయం ఒక్కటీ - కానిద్దాం ఆలస్యం ఎందుకూ -

మన బిడ్డకు బ్రతుకు తెరువు మహ బాగా దొరుకుతుంది - మన జీవిత మికమీద -మహజోరుగ సాగుతుంది -- [ పాట ]-అని తెగ మురిసి తెల్లవారగానే , తమ ఆలోచన అమలు పరచను ,కరుణాకర్ త్వరగా తన ఆఫీసుకు బయల్దేరాడు,రోజూ కంటే ముందుగానే.ఎలాగో తన ఆఫీసర్ను ఒప్పించి , కరుణా కర్ -'వాలెంటరీ ' రిటైర్మెంటు తీసుకుని , తన ముద్దుల బిడ్డకు -తన బదులు ఆ అఫీసులో ఉద్యోగం వేయించాడు,నానా తంటా లు పడి , పడి.. కరుణాకర్ నిజాయితీ ఎన్నో ఏళ్ళబట్టీ చూస్తున్న ,ఆ ఆఫీసర్ ' పెద్దవాడు మరో 3,4, ఏళ్ళలో ఎటూ రిటైరై పోతా 'డని కరుణాకర్ కోరినట్లే -అదే ఊర్లో అదే ఆఫీసులో ఉద్యోగం ఇస్తున్నట్లు ఆర్డర్స్ వేసి ఇచ్చారు.కరుణాకర్ మహదా నం దంగా--' జీవితమే సఫలమూ - ప్రేమసుధా భరితమూ - రాగ సుధానిలయమూ -' అనిపాడుకుంటూ ఇంటికి వచ్చి , భార్యా బిడ్డలకు ,తాను సాధించిన ఘనకార్యం చూపించాడు.-పాపం తమకు ముందున్నది ముసళ్ళపండుగని తెల్సుకోలేకపోయాడు.

తండ్రి చూపించిన ఉద్యోగపుటుత్తర్వులు చూడగానే హనుమంతునిలా ఎగిరిగంతేసి , తానూ ఉద్యోగం చేసి- 'మగ ధీర '- ననిపించు కో బోతున్నందుకు -రాత్రంతా --'కన్ను మూత లేనేలేదు –కలలు ఏవి రానేరావు -ఎందుకింకారాత్రి ఉంది -తెల్లవారదేమి వింత- [నీవురావు ..నిదురరాదు- స్టైల్-- అనిపాడుకుంటూ , ఎలాగో తెల్లారి లేచి త్వరగా తయారై , తండ్రితో కలసి శుభ ఘడి యల్లో ఆఫీసులో అడుగు పెట్టి , రిజిస్టర్లో సంతకంపెట్టి ,ఉద్యోగినని పించు కున్నా డు.సాయంకాలం దాకా ఫైల్స్ తిరగేసి ,ఐదు కాగానే ఇంటిముఖం పట్టాడు.'ఇంటికిపోదాం ..అమ్మను చూద్దాం- గబాగబా , విషయాల్ చెబుదాం ..చకాచకా -[పల్లెకు పోదాం. .పారును-స్టైల్] అని మనస్సులో పాడుకుంటూ ఇల్లుచేరి ,ఉద్యోగంలో మొదటిరోజు విశేషాలు గబగబా చెప్పేశాడు. ' ఎంత

మధుర క్షణములో ..ఇంత శాంతి ఎరుగమాయె '- అనిపాడుకుంటూ కమల, కరుణాకర్లు ఉంటుండగా -నావుడు కధ జరిగిన విధం బెట్టిదనిన -- అదే ఆఫీసులో పనిచేసే ఓరంభలాంటి రాధను చూశాడు , మన-' అమ్మకూచి, చూడగానే మనసు పారేసు కున్నాడు.అంతర్మధనంలో , చిక్కి పోసాగాడు.వంచిన తల ఎత్తని ' అమ్మకూచి ' తనవేపు ఎగా దిగా చూస్తుండటం గమనించనట్లే గమనించిన రాధ , తన తండ్రితో చెప్పింది ,

తనకూ ఇష్టమే అని.ఎందుకంటె అమన అమ్మకూచి మన్మధసమా నుడు అందంలో ఆరడుగుల ఆజాను బాహుడు, ఎర్ర గులాబీ వర్ణపువాడు, ఎందుకునచ్చడూ!రాధతండ్రి , కరుణాకర్ను కలసి విషయం ఎత్తగా,ఆయన తటపటాఇంచగా ,ముద్దులబిడ్డ,'చేసుకుంటే ఆరంభనే చేసుకుంటా..లేకుంటే ..బీష్ముడినవుతా ..'అని చెప్పడంతో తల్లి తండ్రి అంగీకరించారు.ఎర్రని షామ్యానాలో ..ఎత్తైన స్టేజ్ మీద ,రాధామనోహర్ల వివాహ మైంది.అన్నట్లు మనం' అమ్మకూచి ' పేరు మనోహర్. ఇద్దరు ఒద్దికగా ఆఫీసుకు వెళ్ళిరాసాగారు.ఆఫీసులో - పనిచేసేప్పుడు తనవేపు చూస్తే '-చూడ కుమా- కానకుమా -ఆఫీసు..లోనా నావంకా- తప్పులు పోతాయే రంబా.. -[పిలువకురా--స్టైల్] -అని లోలోన పాడుకుంటూ ఉండేవాడు. పెళ్ళైనప్పట్నుంచి గమనిస్తూనే ఉంది రాధ , అన్నింటికీ" - అమ్మా.!. అమ్మా ! " అంటున్న మగడ్ని. ఎలాగైనా ఈ అలవా టు తప్పించాలని , రాధారాధా ' అనిపించాలనీ ఆలోచిస్తూనే నెలతప్పింది.వేవిళ్ళని పుట్టింటి కెళ్ళింది.ఆఫీసునుండీ మగడు మనోహర్ నూ తన ఇంటికే తీసుకెళ్లసాగింది.అలా అలా అతగాడ్ని తన చెప్పు చేతల్లో పెట్టుకుంది.పదోనెలలో ,పండంటి మగపిల్ల వాడ్నికనింది.కరుణాకర్, కమలమ్మల అనందానికి అంతేలేదు.ఆనందం అంతమైందని వారికి తెలినేలేదు...పాపం. పురిటి స్నానం కాగానే ..ఇంటికి తీసుకురమ్మని కొడుకులతో చెప్పారు.కుదరదంది రాధ.పిల్లవాడ్ని చూసుకుంటూ ,ఉద్యోగం చేయలేనంది. కరుణాకర్ దంపతులు-' మేముండగ నీకేలబాధ? ..బిడ్డను చూడగలేమా ? ముద్దులు ఆడగ వలదా! మన మడి కోసం పడిచూశామే -ఎత్తుకు తిరగగలేమా మేమూ.'-[పాట]అని చెప్పగా రాధ నా వల్లకానేకాదంది. అలా మరికొన్ని నెల లు గడిచాయి. మనోహర్ "ఇంటికిపోదాం, అమ్మనాన్నలతో కలసిఉందాం చాలా బావుంటుంది." అని అడిగాడు రాధను. " ఇదిమాత్రం మన ఇల్లుకాదా ? " - " కాదనికాదు..

అమ్మ,నాన్నల వద్దనేఉందాం.." "ఇక్కడా మా అమ్మానాన్నలుఉన్నారు గా? ", " నాకోసం వారెంతో కష్టపడ్డారు ". " నాకోసమూ మా అమ్మానాన్నలు చాలాకష్టాలే పడ్డారు"

,"మానాన్న నాకోసం తన ఉద్యోగం వదులుకుని నాభవిష్యత్తు తీర్చి దిద్దాడు.అమ్మ నాకోసం తన జీవిత మంతా కష్టపడింది." -" మా అమ్మానాన్న లూ అంతే" "నామాటవిను రాధా! మనింటికిపోదా."

-"మీరూ నామాటవినండి మేమిద్దరం మీకు కావాలంటే ఇక్కడేఉందాం."

"నాకోరిక మేరకు నిన్ను చేసుకోను వారు అంగీకరించారు."- " మావారూ నాకోరిక మేరకుమీ తోపెళ్ళి కి ఇష్టపడ్డారు."

" నామాటవినవా? "-

"మీరూనామాటవినండి." విసిగి పోయిన మనోహర్ --' ఇంతేనా నీ మాటింతేనా !- లేదా వేరే మాటా! కన్నవారినే వదలాలా! కమ్మని ప్రేమ ఇదేనా -{పాట] అనిపాడుకొంటూ రాత్రంతాగడిపాడు.ఉదయాన్నే వెళ్ళి తల్లి, తండ్రులకీ మాటచెప్పాడు. --' భార్య ర్యకోసమై అమ్మను వదలెనె అమ్మకూచిగాడు - అయ్యో ..అమ్మకూచిగాడు ,భార్యమాటలే ..భారం బైనా. .వినక . తప్పదాయె , వానికి వినక తప్పదాయె ..తండ్రిప్రేమనే త్యాగంచేసి ..తలను వంచెనంత ' అమ్మ కూచియే . పెళ్ళాం కూచిగ మారిపోయెనంత ' అని బుర్రకథ స్టైల్ లో వారు పాడుకుంటుండగా ,అమ్మకూచి , రాధ కూచియై, 'జగమే మాయ బ్రతుకే మాయ -భార్యలతో భారమింతేనయా ఇదీ ఇంతేనయా ----రేపూ నా..గతింతేనయా --' అనుకుంటూ వెళ్ళాడు పెళ్ళాం బిడ్డల కోసం.




ఆ గది లో మౌనం రాజ్యమేలుతోంది , వున్న నలుగురి మనసులలో వేరు వేరు ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి .

అయితే యెవరు ముందు మొదలు పెట్టాలో అర్ధం కాక ఒకరివైపు ఒకరు చూసుకోసాగేరు .

యింటికి పెద్దని కాబట్టి నాదే మొదటి ఛాన్సు అన్నట్లు     కోపంగా మొదలుబెట్టబోయిన రావుగారు " తాతగారు యిది నా సమస్య , యిందులో మీ జోక్యం సహించను " అన్న సుమ మాటలతో మళ్లా ఆ గదిలో మౌనమే చోటుచేసుకుంది .

" చచ్చేకాలానికి మాకెందుకీ రొష్టు , ఓ టిక్కెట్టుముక్క పారేస్తే యే కాశీయో రామేశ్వరమో పోతాం " పైట చెంగుతో కళ్లొత్తుకుంటూ మెల్లగా అంది యెనభైయేళ్ల శారదమ్మ .

"     నానమ్మా పిచ్చి మాటలొద్దు , నాకు మీ అందరి అంగీకారం కావాలి " .

" చాక్లెట్టా అడగగానే యిచ్చెయ్యడానికి , పరువు ప్రతిష్ట , గౌరవం .... " ప్రకాష్ మధ్యలోనే అడ్డుకుంది సుమ .

" అవి మనకి కూడు పెట్టవు కదా నాన్నా "

" జాతి సంకరం చేస్తే పిండివంటలతో కూడు దొరుకుతుందా ? యెంత సౌమ్యంగా అందామనుకున్నా దాగని కోపం ప్రకాష్ గొంతులో .

" సుమతల్లీ మామాట వినమ్మా , మాకు తలవంపులు తెచ్చే పని చెయ్యకు తల్లీ , యేడాది లోపల మంచి సంబంధం తెచ్చి ఆకాశమంత పందిరి భూదేవంత పీట వేసి నీ పెళ్ళి చేస్తాం తల్లీ , ఆ కులం గోత్రం లేని పెళ్ళి చేసుకోకు తల్లీ " అన్నాడు ప్రకాష్ .

" నా గతం అంతా మరిచిపోయి పూర్వపు సుమని అవాలని వుంది కాని నేనెప్పుడో గీత దాటేను నాన్నా "

" యెక్కడో అమెరికాలో జరిగిన విషయం కదా మరిచి పో , యిక్కడ యెవ్వరికీ చెప్పొద్దు , కొత్త జీవితం కొత్తగా మొదలు పెడుదూగాని తల్లీ "

"     అబద్ధాల పునాది మీద నిలబెట్టిన కొత్తజీవితం యెన్నాళ్ళు నిలబడుతుంది నాన్నా " .

" నువ్వు పిచ్చి వాగుడు వాగకపోతే యెన్నాళ్ళైనా నిలబడుతుంది " అంది నిభాయించు కోలేని మాలతి .

" సత్యమునే పలుక వలెను అని పిల్లలకి నువ్వు చెప్పే పాఠం తప్పంటావా అమ్మా "

" ఔనే నిన్ను కనడం ఒక తప్పే , పెంచి పెద్దచేసి చదువులు చెప్పించడం మరో తప్పే , మదవెక్కి యెవడితోనో పోయి సిగ్గు లేకుండా చెప్తున్నావు చూడూ అదివిని నీకు బడిత పూజ చెయ్యకుండా వూరుకున్న నీ అమ్మా అబ్బలది అన్నిటికన్నా పెద్ద తప్పు . ముందు దాన్ని ఆ గదిలో పారేసి తలుపు తాళం వెయ్యి . తరవాత సంగతి తరవాత చూసుకుందాం " అన్న రావుగారి మాటలు విని శాంతంగా

" పాతకాలంలో వుండి పోయేవు తాతయ్యా , అసలు తప్పంతా నీది అని నేనంటే నీ సమాధానం యేమిటి " .

" భడవా నేను ఔనంటేనే వాడితో పోయావుటే , వితండవాదం కాకపోతే " .

" అసలు సమస్య నొదిలేసి యిదంతా యెందుకు కానీ నా మాట విను " యెలాగైనా కూతురుని వొప్పించాలనే తాపత్రయం ప్రకాష్ ది .

" అసలు విషయమే మాట్లాడు తున్నాను నాన్నా , తోటివారితో పోటీ పడకూడదు , అబద్ధాలు ఆడకూడదు అని చిన్నప్పటి నుండి మాకు నూరిపోసి , ఆ సూక్తులని మీరు ప్రతీ రోజూ అధిగమిస్తూ వుంటే అయోమయంలో పడి వూరుకోలేక అడిగినందుకు నాకు లభించిన బహుమతి తొడపాశం . మొదటి నుంచి ఈ పోటీ నాకు పడేది కాదు . అందుకే యే పోటీ పరీక్షకి వెళ్ళేదాన్ని కాదు . సామర్ధ్యం వున్నా అరవై శాతం కన్నా యెక్కువ మార్కులు తెచ్చు కొనేదాన్ని కాదు . నాకన్నా పెద్దదయిన పెదనాన్న కూతురు రమ్య యింజనీరింగు లో చేరడం తో మీకు పెదనాన్న తో పోటీ యేర్పడింది . చిన్నప్పటి నుండి మీలో అణిగి వుండిపోయిన ' నేను అన్నతో పోటీపడి గెలవలేకపోయానే ' అనే భావం ఈ సారి నాద్వారా గెలవాలనే పట్టుదల మీ చేత నన్ను యింజనీరింగు లో చేర్చేవరకు వూరుకోనివ్వ లేదు . అంతర్గతంగా రమ్య మీద వున్న అసూయతోనో , అంతకు ముందే ఈ కోర్సులలో చేరిన యిరుగు పొరుగు వారి చూపులలోని తేడా ని పోగొట్టాలని అనుకున్నావో గాని నేనూ యెదురు చెప్పకుండా యింజనీరింగు పూర్తి చేసేను . అప్పటికే అమెరికా చదువులకి యెగిరిపోయింది రమ్య . మీ కూతురు కూడా అమెరికా లోచదువుకోవాలనే కోరిక మీలో తలెత్తింది . నా కొచ్చిన స్కోరు మంచి యూనివర్సిటీలో సీటు సంపాదించ లేకపోయింది . ధూం ధాం గా అక్కకి అమెరికా వరుడి

తో పెళ్లి చేసి బ్యాంకు బాలెన్సు సున్న చేసుకున్న మీరు అమెరికా చదువు వద్దంటారని యెదురుచూసిన నాకు నిరాశే మిగిలింది . అమెరికా మోజు మనలని ఆలోచించుకోనివ్వ లేదు . అంతర్గతంగా నేను కూడా అమెరికా జీవితం కోరుకోడం తో వివేకం కోల్పోయి ఆ మారుమూల యూనివర్సిటీకి బయలుదేరేను .

" కాలూ కడుపూ కట్టుకొని యిక్కడి రూపాయలని డాలర్లు గా మార్చి నిన్ను చదువు కోమని పంపితే ఒళ్ళు .... చేసిన వెధవ పనికి సిగ్గు పడి ఛావక మమ్మల్ని తప్పు పడతావటే " పళ్ళు కొరికేడు ప్రకాష్ .

" ఆ యూనివర్సిటీ లో చదువు కాక వ్యభిచారం నేర్పేరుటే నీకు " కళ్ళెర్ర చేసేరు రావుగారు .

" ఎవరు యెలా అనుకున్నా నాకు సంబంధ లేదు . అక్కడ యేం జరిగింది అన్నది మీకు చెప్పే బాధ్యత నా మీద వుంది . మీరు నేర్పిన సంస్కారం , విలువలు నేను మరిచిపోలేదని , మిమ్మల్ని చిన్న బుచ్చడానికి నేను ఈ పని చెయ్యలేదనేది మీరు నమ్మితే చాలు . మీరు వొప్పుకుంటేనే నేను రోషన్ చేత తాళి కట్టించుకుంటాను లేకపోతే జీవితాంతం యిలాగే వుండి పోతాను , ముందు నే చెప్పేది వినండి .

" నేను అక్కడకి వెళ్లింది సెప్టెంబరు ఆఖరు వారంలో . అక్కడి వాళ్లకి అది వేసవి . హైదరాబాదులో కొన్న లాంగు కోట్లు అప్పటికి సరిపోయేయి . వేరే అపార్టుమెంటు తీసుకుంటే అద్దె యెక్కువ అవుతుందని పేయింగెస్ట్ గా చేరేను . లాండులార్డు కి మూడు నెలల అడ్వాన్సు యిచ్చి , యూనివర్సిటీ రాకపోకలకి పాతకారు కొనుక్కొనే సరికి నాదగ్గర డాలర్లు నిండుకున్నాయి . అక్కను అడిగితే వంద డాలర్లు పంపి పార్టుటైము పనేదైనా చూసుకొని చదువుకో మని సలహా యిచ్చింది . అమెరికా ఆర్థిక పరిస్థితులు తలకిందులవడంతో బావ వుద్యోగం పోగొట్టుకొని అక్క జీతంతో యిల్లు గడుపుతున్నారు వాళ్లు , అది మాత్రం యేంచేస్తుంది . చేతిలోంచి జారుతున్న ప్రతీడాలరూ నాలో భయాన్ని నింపుతోంది . మా మొత్తం యూనివర్సిటీ ని కిందా మీదా వేసినా పట్టుమని పది మంది భారతీయులు లేరు . యెవరితో నా భయాలు పంచు కోవాలో తెలిసేది కాదు . నెలకి సుమారుగా నాకయే ఖర్చు పదిహేను వందల డాలర్లు . మిమ్మల్ని అడగొచ్చు . నెలకి ముప్పైవేల జీతగాడు నెలకి లక్ష రూపాయలు యెక్కడనుంచి తేగలడు అనే వివేకం నన్ను అడగకుండా ఆపింది .

లోకల్ గా వుండే ప్లేస్ మెంటు యేజెన్సీ లో నా వివరాలు యిచ్చి వచ్చేను .

మూడు నెలల అడ్వాన్సు యివ్వడం వలన ఫుడ్ కి బెడ్ కి యిబ్బంది లేదు దాని తరవాత అనే దగ్గర నా ఆలోచనలు ఆగిపోయేవి . నా యిబ్బంది సీనియర్సకి చెబితే ముగ్గురు నలుగురు షేర్ చేసుకొనే అపార్టుమెంటు తీసుకుంటే తక్కువ ఖర్చు పడుతుందని

, ఆడామగా కలిసి ఒక యింట్లో కలిసి వున్నంత మాత్రాన శీలం యేం పోదని , అలా పోయేదే అయితే యిక్కడకి రాబోయే ముందు ఇండియాలో దాచుకు రావలసిందని సలహా యిచ్చేరు , ఆ ముగ్గురు నలుగురు యేరీ ? వారిని బతిమాలి వారి జాగాలో వొక రోజు పని చేసి చిన్న చిన్న అవుసరాలు తీర్చుకోగలిగేను . అదీ నెలకి ఒకళ్ళో యిద్దరో వప్పుకొనేవారు . డబ్బు చేదు కాదుకదా యెవరికీనూ .

ఏజెన్సీ వాళ్ళు హెల్పర్ పని వుందని పిలిచేరు . హెల్పర్లు అంటే యిల్లు తుడిచి , అలకడం , బాత్రూములు కడగడం అన్నమాట . ముందు తటపటాయించినా గత్యంతరం లేక వొప్పుకున్నాను . ఖర్చులన్నీ పోగా యాభైడాలర్లు వరకు మిగిలేవి . మనం పండుగులకి యిళ్ళు దులుపుకొని కడుక్కోమూ అక్కడా అంతే క్రిస్మస్ ముందు మాత్రమే పని వుంటుంది .

కొత్త సంవత్సరం నాకు ఆనందాన్ని తేలేదు . నాకు అర్జెంటుగా రెండువేల డాలర్లు కావాలి . మా ఓనరుకి మరో మూడునెలలకు అడ్వాన్సు కట్టాలి లేదా తట్టా బుట్టా సర్దుకోవాలి . నా గడువు ముగిసి పోయినా మరో నెల వుండనిచ్చేరు అదీ వారి కుక్కల సంరశణ చూసుకోవాలనే షరతు మీద , అప్పటికే బాత్రూంలు కడిగిన నాకు కుక్కల సంరక్షణ కష్టమనిపించలేదు " .

" ఇంత మంచి కుటుంబంలో పుట్టిన నువ్వు యిలాంటి పనులు చెయ్యడ మేమిటే " ఉక్రోషంతో అరిచింది మాలతి .

" ముందు చూపు లేకుండా చేసే పనులు యిలాంటి ఫలితాలనే యిస్తాయమ్మా , యీ చేతులతోనే వాటికి స్నానం చేయించేను , మాంసాహారాలూ వండేను . ఆ నిస్సహాయతని నాలో దాచుకోలేక భగవంతుడా పై జన్మలో యిలాంటి దేశం లో కుక్క గా పుట్టించు అని యెన్ని సార్లు కోరుకున్నానో ? . ఒక్క యేడాది యెలాగో అలాగ గడిపేస్తే రెండో సంవత్సరం చదువుకి వేరే యూనివర్సిటీకి ట్రాన్సఫర్ పెట్టుకోవచ్చు . సిటీ లో పార్ట్ టైము వుద్యోగావకాశాలు యెక్కువగా వుంటాయి . నాలుగు నెలలు గడవడమే కష్టంగా వుందే మిగతా ఆరు నెలల యేంచెయ్యాలి .

" భగవంతుడా పై జన్మలో యిలాంటి దేశం లో కుక్క గా పుట్టించు " అన్న సుమ కోరిక వినగానే శ్రోతలలో ఆమె యెంతటి నిస్సహాయ స్థితిని యెదుర్కుందో అర్ధమయింది .

" నా సమస్యని నా సీనియర్స ముందుంచి సలహా అడిగేను . అందరూ కాకపోయినా కొందరు నాలాంటి సమస్యలని యెదుర్కొనే వుంటారనే నమ్మకం నాది .

అప్పుడే తెలిసింది రోషన్ కూడా నాలాగే యిబ్బందులు పడుతున్నాడని , ఓ అమ్మాయి యిచ్చిన సలహా ప్రకారం యిద్దరం లివింగ్ రిలేషన్ షిప్ లో వున్నామని రోషన్ యింటి ఓనరుకి చెప్పి యిద్దరూ అక్కడే వుండడం . రోషన్ వుండే యిల్లు వూరికి దూరంగా వుండడం తో రోషన్ వెళిపోతే యింకొకరు అద్దెకు రారేమోనని ఓనరు కి భయం .అందుకు మరో మనిషి ఛార్జెస్ అడుగడు . ముఖ్యంగా ఒక కారు అమ్మేసి ఒకే కారుని యిద్దరూ వాడుకోవచ్చు . ఒక మనిషి ఖర్చుతో యిద్దరూ బతకొచ్చు .ఈ ప్రపోజల్ నాకు నచ్చినా నా సందేహాలు నాకున్నాయి , అందుకే రోషన్ తో మాట్లాడేక నిర్ణయం తీసుకోవాలని అనుకున్నాను .

రెండుమూడు సార్లు అతని యింటికి వెళ్లేను మనిషి నమ్మదగ్గట్టే అనిపించేడు . అలా కనిపించకపోయినా గత్యంతరంలేదు . నా గడువు తీరగానే నా సామానులతో రోషన్ రూముకి మారిపోయేను . అతని కారు అమ్మి మా సెమిస్టర్ పరీక్షలకి కట్టవలసిన సొమ్ము సమకూర్చుకున్నాం . అతనే పార్టు టైము పనులేవో చేసి యిద్దరి అవుసరాలు తీరేంత సంపాదించేవాడు .

ఉన్న ఒక్క మంచం నా కిచ్చి అతను కార్పెట్ మీద పడుకొనేవాడు . నా గురించి అతని మనసులో యేఅభిప్రాయముందో గాని నాకు మాత్రం యిది యీ ఆరు నెలలు గడపడానికి చేసుకున్న వో వొప్పందం మాత్రమే . ఆరు నెలల తరువాత అతనెవరో నేనెవరో అంతే . ఇక్కడ కొనుక్కొని తీసుకు వెళ్ళిన చలి బట్టలు అక్కడ యేమాత్రం పనికి రావని శీతాకాలం మొదలవుతూనే అర్ధమయింది . నా చేతిలో చిల్లి గవ్వ లేదు . పళ్ళు బిగువున చలి ఆపుకొనేదాన్ని . ఓ రోజు రోషన్ రెండు స్నోకోట్లు తెచ్చేడు . వద్దనాలని వున్నా వివేకం హెచ్చరించడంతో తీసుకున్నాను . నాకు వుద్యోగం రాగానే రోషన్ దగ్గర తీసుకున్న ప్రతీ పైసా లెక్క కట్టి వడ్డీ తో సహా తీర్చెయ్యాలని నిర్ణయించుకున్నాక మనస్సు కొంత శాంతించింది .

వెంటాడి వేటాడే మృగాలు తిరిగే యీలోకంలో చెయ్యిజాచితే అందేంత దూరంలో ఆడపిల్ల వున్నా పట్టనట్టుగా వుండే రోషన్ ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలుగజేసేది .

ఇంటిపనులలోనూ చదువులోనూ అడగక ముందే సహాయపడేవాడు .

ఎక్కువగా యెవరి పనులలో వారం వుండేవారం , మా మధ్య మాటలు చాలా తక్కువగా జరిగేవి . తక్కువగా జరగడం కాదు , అలా వుండేటట్లు చూసుకున్నాను అంటే సరిపోతుందేమో .

"అందుకే ఉప్పు నిప్పు ఒకచోట ఉంచకోడదనేది , దరిద్రానికి దగ్గరా వెళ్లి దరిద్రం పట్టిందని యేడ్చిందిట నీలాంటిదే , అంతగడవక పోతే తిరిగి వచ్చే లేకపోయేవ్ " శారదమ్మ అరిచేసింది .

" మీ అన్న మనుమడు సగంలో చదువాపేసి వచ్చేస్తే మీరందరూ యెన్నెన్ని మాటలన్నారో గుర్తు తెచ్చుకో నానమ్మా , యివాల్టికి కూడా వాడిని అమెరికా పంపడానికి చేసిన అప్పులు తీర్చలేక మీ మేనల్లుడు యెన్ని అవస్థలు పడ్డాడో , చేతకాని వాడని పిల్లనివ్వడానికి యెవరూ ముందుకు రావటం లేదని , చేతకాని చవట అని నువ్వే యెన్ని సార్లు తిట్టేవో గుర్తు తెచ్చుకో "

" ఓహో అయితే యిప్పుడు నువ్వు చేసిన పని చాలా గొప్పదని నిన్ను నెత్తిన పెట్టుకోవాలన్న మాట బాగుందే నీ సమర్ధింపు " .

" నిజమే నానమ్మా , మధ్యలో చదువు చంకనాకబెట్టి వచ్చెస్తే అప్పటి వరకు పెట్టిన డబ్బు వృధావే కదా ! ఒక యింట్లో వున్నంత మాత్రాన కాపురం చేసినట్లు కాదుకదా అనుకున్నాను గాని యిలా అవుతుందని కున్నానా "

" సరే పిడకల వేట తరువాత ముందు అమలు సంగతి చెప్పు " ముందు విషయం తెలుసుకుంటే పరిష్కారం సులువవుతుందనే తొందర ప్రకాష్ ది

మరో యూనివర్సిటీకి మారేంతవరకు యెలోగోలా కాలం గడపాలని నిర్ణయించుకున్నాను కాబట్టి అతని విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం చూపించలేదు . సాధ్యమైనంత వరకు అంటీముట్టనట్టు గా గడిపేదాన్ని . మన వంశ మర్యాదల గురించి అవుసరం లేకపోయినా ప్రతీ రోజూ వినిపించేదాన్ని . అతనిని కించపరచాలని కాదు కాని యెందుకో అలా మాట్లాడాలని అనిపించేది లేకపోతే నాలో వుండే అపరాధాన్ని భావం నాతో అలా అనిపించేదో ? ఆర్ధిక యింబ్బందులు లేవుకాబట్టి రోజులు గడుస్తున్నాయి . ఫరవాలేదు యిలాగే మరో ఆరుమాసాలు గడిపేయవచ్చు అనే నిబ్బరం పడుతున్న సమయంలో విధి కన్నెర్ర చేసింది .

విధి అనేది వొకటి వుంటుందని దానిని తప్పించుకోడం మనవల్లకాదని నిరూపించుకున్న సంఘటన జరిగింది .

ఫిబ్రవరి మూడో వారంలో అనుకుంటా రెండు రోజులలో మంచు తుఫాను రాబోతోందనే హెచ్చరికతో విద్యాసంస్థలు శలవు ప్రకటించేయి . మా ఓనరు మరో రెండు రజ్జాయిలు యిచ్చి యిది కప్పుకొని దగ్గరగా హత్తుకు పడుకోమని చెప్పివెళ్ళి పోయేడు . మొదటి రోజు హీటర్స్ పనిచెయ్యడంతో మంచు తుఫానుని కిటికీ లోంచి చూస్తూ వేడి కాఫీ తాగుతూ యీపాటి దానికి వీళ్ళు భయపడ్డమే కాక మనని కూడా భయపెట్టేరని నవ్వుకున్నాం , మా నవ్వులకి ప్రకృతికి కన్నుకుట్టిందేమో ఆ

రోజు రాత్రి విపరీతంగా మంచు కురవ సాగింది పవర్ కట్టయింది . కొవ్వొత్తి వెలిగించి తెచ్చిన ఓనరు పాలు , పళ్ళు బ్రెడ్డులతోనే గడుపు కోవాలని తిరిగి ఎలక్ట్రిసిటీ రావడానికి కనీసం పదిరోజులైనా పడుతుందని చెప్పి వెళ్ళిపోయేడు .

ఆ రాత్రి నరకయాతన అనుభవించేం , మాకోట్లు , రజ్జాయిలు కప్పుకున్నా ఆగలేదు చలి . ఆ చలికి తట్టుకోలేని శరీరం నరనరం వణక సాగింది . ఇలా వుంటే యెంతో సేపు బతకలేమన్నది తెలిసిపోయింది . చావుని చాలా దగ్గరగా చూసేం . సాంప్రదాయాలు , కట్టు బాట్లు , కులం గోత్రం యేవీ గుర్తురాలేదు . తెలుస్తున్నదల్లా బ్రతకాలనే కోరిక . చావు ప్రతీ వాళ్లకీ వస్తుంది అన్నది తెలుసుగాని యిలాంటి చావు పగవాళ్ళకి కూడా రాకూడదు . తప్పు ...ఒప్పు ... శీలం వీటన్నిటికీ ' నేను ' అంటూ వుంటేనే కదా అని అనిపించిన ఆ బలహీనమైన క్షణం లో అలా జరిగి పోయింది . ఆ క్షణం దాటిన తరువాత దీనికన్నా చావు మేలేమో అని చాలా సార్లు అనుకున్నా నాన్నా , నిజం నా కిష్టమైన నా కుటుంబం మీద వొట్టు వేసి చెప్తున్నా .

పది రోజులకి వాతావరణం బాగుపడింది . -20c డిగ్రీలలో బతికి వుండాలంటే అంతకన్న గత్యంతరం లేదు . కాని మాలో అలజడి తగ్గలేదు . ఏదో తప్పు చేస్తున్నామన్న భావన యిద్దరిలోనూ వుంది , బతికుండాలంటే అంతకన్నా గత్యంతరం కూడా లేదు .

ఇలాంటి బ్రతుకు అవుసరమా ? అని రోజుకి యే వందసార్లో అనిపించేది . ఎక్కువగా మౌనంగా గడపసాగేం . రోజు ఒక యుగంగా గడిచింది . ఈ లోపల నాకు సియాటల్ , రోషన్ కి షికాగో యూనివర్సిటీ లకి ట్రాన్సవర్ వచ్చేయి .

అదే నేను కోరుకున్న ముగింపు నా కథకి , కాబట్టి చాలా సంతోషంగా టా టా బై చెప్పే సా .

ఓ పక్క చదువు , పార్ట్ టైము వుద్యోగం తో బిజీ అయిపోయేను . పేపర్లు సబ్మిషన్ అయిపోయింది . కాంపస్ సెలక్షన్ లో మంచి వుద్యోగమే సంపాదించుకోగలిగేను . మీ దగ్గర నుంచి పెళ్లి కొడుకుల ఫొటోలు రాసాగేయి . అప్పుడు మళ్ళా అంతర్మధనం మొదలయింది . నా రహస్యాన్ని నాలలోనే దాచుకొని తలవంచుకొని తాళి కట్టించుకొని పెళ్ళి మంత్రాలని అవహేళన చేసి జీవితాంతం తలదించుకు బ్రతకాలా ? లేక బ్రతకడం కోసం వేసిన తప్పటడుగుని దిద్దుకొని తలయెత్తుకు బ్రతకాలా ? యేమీ తోచిన అయోమయం . అందుకే వుద్యోగంలో నిలదొక్కుకోవాలని మీ దగ్గర ఆరునెలలు సమయం అడిగేను .

రోషన్ బాకీ అతని కి పంపేసి ఋణవిముక్తురాలనయేనని సంతోషించేను .

ఏమిటో మనస్సు తేలిక అవడంపోయి మరింత బరువు గా మారింది .

ఆరునెలల గడువు పూర్తయింది కాని నా ఆలోచనలు ఒక కొలిక్కి రాలేదు . నాకేమీ ప్రత్యేకంగా రోషన్ అంటే యిష్టమూ లేదు , అయిష్టమూ లేదు . మనిషి మంచివాడే . అంతకుమించి అతని గురించి గాని అతని కుటుంబం గురించి గాని నాకేమీ తెలిదు , తెలుసుకోవాలని ప్రయత్నించలేదు .

పెళ్లి అనే ఆలోచన నాలో వచ్చినప్పుడల్లా నాలో యేదో అలజడి మొదలయ్యేది . మొదటిసారి మీరు పంపిన వరుడి తో మాట్లాడినప్పుడు విదేశాలలో చదువుకున్న ఆడపిల్లల మీద సగటు మగపిల్లడి భావాలు యెలా వుంటాయో అర్ధం అయ్యింది . చదవుకున్నా మగపిల్లల మనఃస్తత్వం మారలేదని తెలుసుకున్నాను . నా పొరపాటున కప్పిపుచ్చుకొని తాళి కట్టించుకోవాలి లేదా జీవితాంతం నాలోని అపరాధానా భావాన్ని మోస్తూ జీవించాలి .

మొదటిది నాకు సమ్మతం కాదు . ఎటూ నిర్ణయించుకోలేని స్తితిలో రోషన్ నుంచి వచ్చిన చిన్న ఇ- మెయిల్ తెచ్చిన సందేశం నన్ను యీ నిర్ణయం వైపు నడిపించింది . దాని ప్రకారం రోషన్ కూడా నాలాగే అయోమయంలో వున్నాడని , యెవరో ముక్కు మొహం తెలిని వాళ్లతో జీవితం పంచుకొనే బదులు శరీరాలు కలసిన మనం ఒకటైతే కనీసం మిగతా జీవితం అపరాధ భావం నుంచి తప్పించుకున్న వాళ్లమౌతాం కదా అన్నది సారాంశం .

సుమారు పద్దెనిమిది నెలలు గిల్టినెస్ ని మోసిన మనస్సు అలసిపోయింది . అందులోంచి బయటపడతాను అనే ఆలోచనే నాకు యెంతో రిలీఫ్ నిచ్చింది . రోషన్ తెచ్చిన ప్రతిపాదన తరువాత అతని గురించి ఆలోచించడం మొదలుపెట్టేను . నేను భర్త యెలా వుండాలనుకున్నానో చాలా మటికి

అలానే వున్నాడు . నా కుటుంబ సభ్యులని ఏక్సెప్ట్ చెయ్యడానికి అతనికి లేని అభ్యంతరం నాకెందుకుండాలి . మీరు చూసిన సంబంధ మైనా వాళ్ల గురించి నాకెంత తెలుస్తుంది , రోషన్ గురించి నాకు అంతకన్నా యెక్కువే తెలుసు .

మన చుట్టాలు నన్ను రోషన్ని ఆదరించాలని నేను ఆశించటం లేదు . పచ్చని పందిట్లో వేదమంత్రాలమధ్య నన్ను గన్న తల్లి తండ్రులు కన్యాదానం చేస్తే నా వైవాహిక జీవితం చల్లగా సాగుతుందని నా నమ్మకం . మీరు కాదంటే రోషన్ తో కాపురం పెట్టెస్తానని అనుకోవద్దు , కని పాతికేళ్లు పెంచిన మీ మమకారం కావాలినాకు , కొన్ని రోజుల సాహవాసం కాదు . మీ నిర్ణయమే నా నిర్ణయం " . ధారాపాతంగా కారుతున్న కన్నీటిని రుమాలులో దాచే ప్రయత్నం చేసింది సుమ .

ఇన్నాళ్లుగా దాచుకున్న బరువు బయటపడడం తో యెంతో తేలికైంది సుమ మనసు .తలపైన పడ్డ నాలుగు చేతులు మౌనంగా తమ అంగీకారాన్ని అందజేసేయి . మాలతి చేతులు మౌనంగా సుమ కన్నీటిని తుడి చేయి .




లల్లీ ,లల్లీ ,అని మధు పిలవగానే, ఇల్లు ఊడ్చి అప్పుడే బయటికి వెళ్లబోతున్న పనమ్మాయి రమణి,ఓ క్షణం ఆగి , అయ్యగారూ,అమ్మగారు ఎదురింటికి వెళ్లారు.చెప్పి చీపురు ఓ మూల పెట్టి ఆమె వెళ్లిపోయింది.

దాంతో మధు,శూన్యంలోతుల్లోకి చూస్తూ ,లలిత ఈ మధ్య బాగా డల్ అయిపోయింది.ఎప్పుడూ పరమ పరధ్యానంగా ఉంటోంది.అసలు మా ఆవిడ ఇలా తయారవుతుందని నేనెప్పుడూ అనుకోలేదు.అదీ కేవలం ఓ కుక్కపిల్లకోసం ఇంతలా మనసుని ముంతలా పగల కొట్టుకుంటుందని ఊహించలేకపోయాను.మా పెళ్ళికి వాళ్ళ పిన్ని ఓ ఫారన్ బ్రీడ్ పామేరియన్ కుక్కపిల్లని ఇచ్చి వెళ్లింది.మా ఆవిడ దానికి జిమ్మీ అని పేరు పెట్టింది.అలా అది అప్పటినుండీ, అంటే గత మూడేళ్లుగా అది మాతోనే ముడేసుకుంది.పిల్లా పిచుకా లేరేమో,మరీ జిమ్మీ దానికి తుమ్మ జిగురులా దగ్గరైంది.కానీ ఓ పక్షం రోజుల క్రితం వరకూ మా ఇంట్లో తెగ కలియ తిరిగేదల్లా, హఠాత్తుగా మాయమై తగలడింది. అప్పటినుండి నా బతుకు చిరిగిన తలగడైంది.

కుక్కపోతే ఆమె బాధపడాలి కానీ నాకెందుకీ ఉక్కపోత అంటే ,దానిపై ప్రేమతో లలిత నన్ను చెడుగుడాడేస్తోంది మరి.ఎలా అంటే

,ఉదాహరణకి, పోయిన ఆదివారం నాడు నేను ఆబగా చికెన్ లెగ్ పీస్ ఎంతో ఆత్రంగా తింటున్నాను.నా వైపే కొద్ది సేపు దీర్ఘంగా చూసి,జిమ్మీ కూడా మీలానే చికెన్ లెగ్ పీస్ ఎంతో ఆత్రంగా తినేది సుమా అని ఆమె అనగానే, నాకు ఆకలి చచ్చి తనని రోకలితో కొట్టాలన్నంత కచ్చి వచ్చింది.కాని ఏదో జిమ్మీ పోయిన బాధలో ఉండి అందిలే అని సరిపెట్టుకున్నాను.కాని తర్వాత తన ముందు చికెన్ మనస్ఫూర్తిగా తినలేకపోయేవాడ్ని.ఆ తర్వాత అది ముదిరి ,నేను అరిస్తే అచ్చం జిమ్మీలానే అరుస్తున్నానని ,ముద్దు పెట్టుకుంటే ,జిమ్మీ నాకినట్టుందని,తన బుజం మీదో, ఒళ్ళోనో తల పెట్టుకుంటే ,అచ్చం జిమ్మీ కూడా ఇంతే అని నా మూడ్ని మ్యూట్ చేసేసేది.ఇంకా చెబితే పరువు చేటు.బెడ్రూం లో, నిద్రలో నేను పొరపాట్న చెయ్యో,కాలో వేస్తే, జిమ్మీ పో అవతలికి పోయి ఆ మూల గోని పట్టామీద పడుకో.చిచ్చుకొస్తే పెరట్లోకి పో .అంటూ ఆ నిద్ర మత్తులో నన్ను మంచం పై నుండి నెట్టేసి ,తోసేసి కింద పడేసేది.అలా కింద పడి ఓ సారి నా తల వాచింది కూడా. తర్వాత ఓ సారి నాకు పాలు, గ్లాసులో బదులు గిన్నెలో తెచ్చి తాగ మంది. సరే ఏమంటే ఎమౌతుందనే భయంతో,ఆ గిన్నెలోనే పాలు తాగేసాను. అలా తాగుతున్నపుడు,నా తల నిమరడం,మెల్లగా తాగు అంటూ నా చెవులు సవరదీయడం లాంటి చేష్టలు చేస్తుండడంతో నాకు ఏం చేయాలో పాలుపోక మానసిక వైద్యుడికి చూపిస్తే ,అతను బాగా చెక్ చేసి ,ఆమెకి ఆమె దారిలోనే వెళ్ళి చెప్తే ప్రయోజనం ఉండొచ్చు అంటూ పంది బరువు మందులు రాసాడు. అని మధు ,అలా గతం లో ఆలోచిస్తుండగానే ,ఏదో శబ్దం కావడంతో ఆలోచనల్లోంచి బయటికి వచ్చి చూడగా,లలిత కంట నీరుతో వస్తూ,చూడండి ఆ ఎదురింటి శరణ్య, నన్ను ఎంతగా అవమానించిందో ,చెప్పింది ,స్వరంలో బరువుతో.

అవునా? ఇంతకీ ఏమైంది లలితా! ఏమన్నారావిడ అడిగాడు నిదానంగా .

వాళ్ళ పెంపుడు గుర్రం ఈ మధ్యే జబ్బు చేసి చనిపోయిందట.పైగా దాని పేరు కూడా లల్లియేనట.అది కూడా నాలాగే పొట్టిగా దుక్కాలా ఉండేదట.నా జడ చూస్తే దాని తోక గుర్తొస్తోందట.దానివి కూడా నాలాంటి డొప్ప చెవులేనట.నా నవ్వు వింటుంటే ఆవిడ గుర్రం సకిలింపు గుర్తొస్తోందట.దానికి కూడా అచ్చం నాలాగే ముక్కు మీద పుట్టుమచ్చ ఉందట.పైగా తినడానికి కూడా నాకు గుగ్గిళ్లే పెట్టింది.ఊ అని చిన్న ఏడుపు ఏడ్చి, ముక్కు చీది ,నన్ను ఓ జంతువుతో అయిదు నిమిషాలు పోలిస్తేనే నాకు కోపం పెరిగిపోయింది.ఒళ్ళు మండిపోయింది.అలాంటిది నేను మీకు జిమ్మీ పై ప్రేమతో చేసింది తలుచుకుంటే ,అంటూ మళ్ళీ ముక్కు చీది,కంట నీరు పెట్టింది.

ఏం పర్లేదు లలితా ,బాధ పడకు.మూగ జీవాల్ని పెంచడం ,ప్రేమ పంచడం ఏమాత్రం తప్పుకాదు.అందులో ఏ తప్పూ లేదు.కాని వాటి మోజులో అతి పోకడలు మంచిది కాదు.మంచి బ్రీడ్ అని రెండు లక్షలు పెట్టి ,ఓ కుక్కపిల్లని కొని నీ ఫ్రెండుకి గిఫ్టు చేశావ్. అలాంటివి చేయడం వలన , మూగ జీవాల జాతుల పిల్లలని పెట్ షాపుల్లో పెట్టి, వస్తువుల్లా అమ్మి , వ్యాపారం చేసి డబ్బు గడిస్తున్నారు కొందరు. ఇక జిమ్మీ ఆలన ,పాలనే సర్వం అన్నట్టు చూసావ్.కాని నేను తిన్నానో లేనో పట్టించుకునేదానివే కాదు.పైగా దానికి పెట్ బ్యూటీ పార్లర్లు, ప్రత్యేకమైన డైట్ , డాగ్ షోస్ కి ట్రైనింగులు లాంటి వాటిలో పెద్ద మొత్తంలో సమయం, డబ్బులు వెచ్చించావ్. ఎక్కువ ఖరీదైన పెంపుడు కుక్కపిల్లల్ని,పిల్లుల్ని పెంచడం స్టేటస్ గా భావించి మురిసిపోవడం అమాయకత్వం. అలాగే నువ్వు ఇష్టపడేంతగానే ఇతరులు కూడా దానిని ఇష్టపడాలనుకోవడం ,అలా కాకపోతే వారు జంతు ప్రేమికులు కాదు అనుకోవడం తగదు.

ఇక ప్రస్తుతానికి వస్తే , నీ తప్పు తెలుసుకున్నావ్.అదే పదివేలు. ఆఖరిగా నీకు చెప్పొచ్చేదేంటంటే, ఎందులోనైనా అతి తగదు.అతి సర్వత్రా వర్జయేత్ అని ఆమెతో చెప్తూ ,దగ్గరికి తీసుకుంటుండగానే, బిడ్డ లా చూసుకున్నది దూరమైందనేనండీ నా బాధ.చెప్పిందామె చిన్న స్వరంతో.

భలే దానివే, బిడ్డలాంటిది ఎందుకు! ఈ సారి బిడ్డనే పెంచుకుందాం.సాయంత్రమే ఆర్ఫన్ హోం విసిట్ చేద్దాం. అని మధు చెప్పడంతో, చాలా మంచి ఐడియాసుమండీ చెప్పిందామె చాలా సంతోషంగా. అంతలోనే,మధు ఫోన్లో వాట్సప్ మెసేజ్ వచ్చింది.దాన్ని చూడగా,ఎదురింటి శరణ్య పంపింది.అన్నయ్యా,ముల్లుని,ముల్లుతోనే తీయాలన్న సూత్రాన్ని అనుసరించి, వదినకి నువ్వు చెప్పమన్నట్టే గుర్రం అదీ,ఇదీ అని తెగ చెప్పేశాను.పాపం వదిన , కన్నీరు పెట్టుకుని మరీ వెళ్లిపోయింది. ఇంతకీ మన ప్లాన్ సక్సెస్సా ? అడిగిందామె .

యెస్ .అని చిరునవ్వుతో టైప్ చేసి, లలితని పూర్తిగా దగ్గరికి తీసుకున్నాడు.




“బాలి !శాండిల్యా హియర్! మాజీఎంఎల్యే రామిరెడ్డి గారిని నీ ఆఫీస్ కు పంపిస్తున్నాను. పది రోజుల క్రితం తమ కూతురు మిస్సింగని మాకు కంప్లయింట్ యిచ్చారు.మా డిపార్టుమెంటు అన్ని విధాలా ప్రయత్నించి చేతులెత్తేసింది.ఫైల్ క్లోజయ్యే స్టేజి .

రామిరెడ్డిగారి పొలిటికల్ ప్రెజర్ తట్టుకోలేక నీకు రిఫర్ చేస్తున్నాను . టైంచెపితే రెడ్డిగారు నిన్ను కలుస్తారు."

"శాండిల్యా ! నీకు టైం నేను యివ్వడమా? వాట్ ఏ జోక్.. యాజ్ యూ ప్లీజ్ .."

"అయితే యిప్పుడే పంపిస్తాను.."

ఆరడుగుల ఎత్తు..ఖాదీ డ్రెస్సు ..అహంకారానికి ..దర్పానికి అద్దంపట్టేలా క్లీన్ షేవ్ కోరమీసం తో తనముందు కూర్చున్న రామిరెడ్డిని చూస్తూ..బాలి

"వివరాలు చెప్పండి. మేము ట్రై చేస్తాము.స్టెల్లా రికార్డు చెయ్.అవినాష్ ! జాకీని అర్జంట్ గా రప్పించు."

"బాలి సాబ్ ! నాకూతురు పదిహేను రోజులక్రితం తప్పిపోయింది. పదిరోజులు క్రిందట పోలిస్ లకు రిపోర్ట్ చేసాము."

"ఐదురోజులు ఎందుకు వేస్ట్ చేసారు?"

"మావాళ్ళతో వెదికించాను. ఆచూకీ దొరకలేదు.అందుకే పోలీసు స్టేషన్ లో రిపోర్ట్ చేసాను."

"అవన్నీ ఏసిపి గారు చెప్పారు. అమ్మాయి పూర్తివివరాలు యివ్వండి. "

"అమ్మాయి పేరు అనుష్కారెడ్డి.నారాయణమ్మ ఇంజినీరింగ్ కాలేజిలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. యిది తనఫోటో. మారెండో అమ్మాయి అవంతికా రెడ్డి కూడా అదే కాలేజిలో సెకండియర్లో వుంది."

“రెడ్డి గారూ! నేను కేస్ తీసుకుంటున్నాను. సాధ్యమైనంత త్వరలో కేసు సాల్వ్ చేస్తాము. రిసెప్షన్లో మాఅమ్మాయి శిరీష వుటుంది .తనతో ఫార్మాలిటీస్ కంప్లీట్ చేయండి.”

****

బాలి ముందు కూర్చున్న అవినాష్ జాకీ స్టెల్లా శిరీషలు ఆయన సీరియస్ ముఖాన్నే చూస్తూ వుండిపోయారు.

“ఈ కేసును మనం డిఫరెంట్ యాంగిల్స్ లో పరిశోధించాలి.ఆల్రెడీ పోలీసులు ట్రైచేసి ఫెయిల్ అయిపోయారు అనుష్కారెడ్డి కోసం అన్ని రాష్ట్రాల్లో జల్లెడ పట్టేశారు. ఆ కోణాల్లో మనం మళ్ళీ ప్రయత్నించడం వేస్టని నా అభిప్రాయం. క్రైం బ్రాంచ్ నుండి టోటల్ ఫైల్ మనకు ఫార్వార్డ్ చేస్తానని శాండిల్యసర్ చెప్పారు .అందరూ స్టడీ చేయండి. లక్కీగా పోలీస్ టచ్ చేయని కోణం మనకు టచ్ అవుతుందేమో ? “

శిరీష తన స్మార్ట్ ఫోన్ లో వచ్చిన ఫైలును అందరి మెయిల్స్ కు ఫార్వార్డ్ చేసింది.

“అవినాష్ ! మనం ఒకసారి ఎంఎల్యేగారి ఇంటికి వెళ్ళాలి . శాండిల్యను కూడా రమ్మని చెప్పు. గర్ల్స్ మీరుకూడా రావాలి. అవంతికారెడ్డి మీటార్గెట్. అర్థమైందా ?”

“ఎస్ బాస్!”

*****

“ రామిరెడ్డి సర్ పొలిటికల్ మీటింగ్ లో వున్నారు.ప్లీజ్ కమిన్.”

ఎంఎల్యే సెక్రటరీ వెల్కం చెప్పాడు.

“అవినాష్ ,జాకీ ! తోటమాలి డ్రైవర్ సర్వెంట్స్.. యువర్ టార్గెట్.నేను శాండిల్యా సైట్ సీయింగ్ ”

ఓకే బాస్ !

దాదాపు మూడు ఎకరాల్లో కట్టిన బిల్డింగది.

“శాండిల్యా ! మన ఎంఎల్యే ఎక్స్ అయినా చాలా రిచ్ గా కనిపిస్తున్నాడు ..పెద్దలు యిచ్చిందా? పాలిటిక్స్ పంచిందా?”

“కట్టు బట్టలతో వచ్చి కార్యకర్తగా పనిచేసి రెండు మూడు జండాలు మార్చి భూకబ్జా దందాలతో ఈస్థాయి కొచ్చాడనేది జగమెరిగిన సత్యం.పోలీస్ స్టేషన్లలో చాలా కేసులు పెండింగ్ లో వున్నాయి.మొన్నటివరకు అధికారపార్టీ వాడు కాబట్టి బయటకు తీయలేదు.”

“వేషాన్ని మీసాల్ని బట్టి నేను వూహించాను.ఈ మూడు ఎకరాల స్థలం ఇల్లూ చూడగానే అర్థమై పోయింది.”

“అర ఎకరంలో బిల్డింగ్ కట్టి మిగతా స్థలంలో గార్డెన్ పెంచాడు. కూతుళ్ళకోసం టెన్నిస్ కోర్ట్ .”

“అంతా ప్రజలసొమ్మే ..అయినా ఈనాటి రాజకీయ నాయకుల స్టైలేయిది .దొరకనంత వరకూ అందరూ దొరలే . ఓకే శాండిల్యా మనం ఒక్కసారి సెక్రటరీ తో మాట్లాడాలి . చిన్న డౌట్ క్లారిఫై చేసుకుంటే ఈ కేసుకు పనికొచ్చే క్లూ దొరుకుతుందనిపిస్తోంది

******

“బాస్! అనూషారెడ్డి గురించి అంతా పాజిటివ్ ఇంఫర్మేషనే. అందరికీ యిష్ట మైన అమ్మాయి. తండ్రి గుణాలు ఒక్కటి కూడా రాలేదని కుక్ చెప్పి ఏడ్చేసింది.పోతే యిరవై రోజులనుండి తోటమాలి ఆబ్సెంట్. వూరిలో తనవారికి బాగోలేదని సెలవు

పెట్టాడట. “

అవినాష్ రిపోర్ట్      పూర్తి అవగానే స్టెల్లా శిరీషలు తమ స్మార్ట్ ఫోన్స్ టేబుల్ మీదపెట్టి

“బాస్ ! అనుష్కారెడ్డి కి సంబంధించిన అన్ని యాంగిల్స్ కవర్ చేసాము. శిరీష చెల్లి కి అవంతికారెడ్డి క్లాస్ మేట్ .పోలీస్ ఫైల్ కందని క్లూఒకటి సంపాదించాము.      అనుష్కా మదర్ పదిహేను రోజులనుండి      హాస్పిటల్లో వుంది. ఈ      విషయం      చాలా గోప్యంగా దాచారు.మాకు మదర్ని పరిచయం చేయమంటే శిరీషకు రహస్యంగా చెప్పింది.అనుష్కా సెల్ లోవున్న      ఫోటో చూపించి అడిగితే      భయపడుతూ మరో రహస్యం చెప్పింది.”

“స్టెల్లా ! ఈ ఫోటోలు ఏమిటి ?చాలా క్లిక్ చేసావు.”

“బాస్! మీకు చెప్పాలంటే ..ఓకుక్కకథ అని మొదలుపెట్టి      జిడిపాకం సీరియల్ చెప్పాలి.”

“చెప్పు ..ఏమో గుర్రం ఎగురుతుందేమో ? కుక్కపిల్ల క్లూ యిస్తుందేమో?”

“ఈ పప్పీ పేరు గోల్డీ. గోల్డెన్ రిట్రీవర్ బ్రీడ్ .క్యూట్ గా వుంటుంది. ఫ్రెండ్లీ గా వుంటుంది. చాలా విశ్వాసం గలది. నెట్ లో వెదికి మరీ కొనుక్కుంది.      రోజూ అక్కాచెల్లెళ్ళు టెన్నిస్ ఆడేవారట.అక్క పాయింట్ సంపాదించగానే గోల్డీ అనుష్క మీదెక్కి ముద్దు పెట్టించుకోనేదట. అవంతిక పాయింట్ సంపాదిస్తే ముడుచుకుపోయేదట. అనుష్క పెడితేనే తినేదట . అనుష్క బెడ్ మీదే నిద్ర పోయేదట. ఈ లక్షణాలన్నీ      పప్పీల లక్షణాలే. కానైతే నాజిడిపాకంలో భయంకరమైన ట్విస్ట్ టెన్నిస్ కోర్ట్ నుండి ఎత్తుకొస్తున్న అవంతిక చెయ్యి కొరికి మళ్ళీ అక్కడికే పారిపోవడం..అవంతిక కోర్ట్ లో కాలు పెడితే భయంకరంగా అరిచి ఆమె మీద అటాక్ చేయడం .కోర్ట్ లో నేనూ శిరీషా ఎత్తుకుంటే తోక వూపిన గోల్డీ      అవంతికను చూసి భయంకరంగా అరిచేసేది. వీడియో కూడా వుంది చూడండి.

ఇది అవంతికా      లెఫ్ట్ హ్యాండ్.

బేండేజ్ తో వున్న చెయ్యి క్లోజప్ లో కనిపించింది.

అనుష్క కనిపించని రోజు నుండీ గోల్డి చాలా డల్ అయిపోయి ఇంట్లో కట్టేస్తే భయంకరంగా మొరుగుతూ వుంటే ఎంఎల్యే గారు దాన్ని గార్డెన్ లో వదిలేయండి అన్నారని వదిలేస్తే గోల్డి తిన్నగా వెళ్ళి టెన్నిస్ కోర్ట్ లోనే సెటిలై పోయేదట. యెవరు ట్రైచేసినా ఇంట్లోకి వచ్చేదికాదట. పాపం అనిపించి అవంతిక బలవంతంగా ఎత్తుకు వస్తుంటే చెయ్యి కొరికేసి పారిపోయిందట.

మేము టెన్నిస్ కోర్టులో తిరుగుతున్నప్పుడు అవంతిక ముఖంలో యెంత భయం కనిపించిందంటే..మీరే చూడండి చాలా క్లోజ్ లో వీడియో తీశాను. బాస్ మేము అవంతికతో గార్డెన్ లో తిరుగుతున్నప్పుడు ఎవరో బిల్డిండ్ పైనుండి బైనాక్యులర్స్ తో మమ్మల్ని గమనించారు."

"వెల్డన్ గర్ల్స్.

"అవినాష్ ! ఈ సెల్ని బిగ్ స్క్రీన్ కి క్రోంకాస్ట్ తో అనుసంధానం చెయ్యి.మనం చూసి అనలైజ్ చేద్దాం.

జాకీ ! దీన్ని నీసెల్లోకి డౌన్లోడ్ చేసుకో. కాలేజికి వెళ్ళు. ఇన్ఫర్మే షన్ సంపాదించు . ఈప్రాసెస్ అంతా సీక్రెట్ గా జరిగి పోవాలి. యిందులో ఏదో పొలిటికల్ గేం ఇన్వాల్వ్ అయి వుందని నాఅనుమానం. శాండిల్యాసర్ హెల్ప్ తీసుకో. బికాషియస్ ." జాకీ వెళ్ళిపోయాడు.

"అవినాష్ ! జాకీ రిపోర్ట్ రాగానే మనం డిస్కస్ చేద్దాం .ముందు మన అమ్మాయిల వీడియోలు చూడాలి తర్వాతే ఏదైనా .."

ఆఫీస్ బాయ్ జానీ పొగలు కక్కుతున్న కాఫీమగ్ లతో ఎంటరై పోయాడు.

అవినాష్ ! సెల్ఫోన్ని క్రోంకాస్ట్ తో ఫిఫ్టీ ఇంచెస్ టీవీమానిటర్ కు అనుసంధానం చేసాడు.

ఫస్ట్ షాట్ ..ఎంఎల్యేబిల్డింగ్.

సెకండ్ షాట్ అనుష్కారెడ్డి స్టడీరూం .

థర్డ్ షాట్ అనుష్కా గోల్డీ       ఫోటోలు.

ఆ తర్వాత ఛానల్ విడియోగ్రాఫర్లా ఇల్లంతా కవర్ చేసింది శిరీష

దాదాపు అరగంట ప్రోగ్రాం .

స్టెల్లా ఫోన్ కనెక్ట్ చేసాడు అవినాష్.

టెన్నిస్ కోర్ట్ ను కవర్ చేసింది.

బాల్ బయటికి పోకుండా చుట్టూ నెట్ కట్టివుంది. కోర్ట్ కు నార్త్ ఈస్ట్ కార్నర్ లో నెట్ ను ఆనుకొనే రెండు క్యుబికల్ టైప్ మోడరన్ బాత్ రూమ్స్ .

“అవినాష్ ! పాస్ చెయ్. నేను గమనించి సెక్రెటరీ ని అడిగాను. బెంగులూరు నుంచి తెప్పించి పదిహేను రోజుల క్రితమే ఎరక్ట్ చేయించారట.ఓకే ప్రొసీడ్.”“బాస్ !జాకీ ఆన్ లైన్”

“ఓకే !జాకీ !

గుడ్ ఇన్ ఫర్మేషన్ . కం టుద ఆఫీస్.

నేను శాండిల్యసర్ ను కలిసి వస్తాను. నౌ ఎవ్విరిథింగ్ క్లియర్.

స్టెల్లా శిరీషా! కంగ్రాట్స్..మీ విడియోలతో క్రొత్త కోణం ఆవిష్కరించారు. బిరెడీ ఫర్ మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్ ఇన్ యువర్ జీళ్ళపాకం సీరియల్."

బాలి వెళ్లిపోతుంటే అమ్మాయిలిద్దరూ అవినాష్ వంక ట్విస్ట్ నీకుఅర్థం అయ్యిందా ? అన్నట్లు చూసారు.

"నోనోనో " అన్నట్లు మూడు సార్లు మూడు రకాల ఎక్స్ ప్రెషన్స్ యిచ్చాడు అవినాష్.."

*****

"శాండిల్యా ! నీకు రామిరెడ్డి బాగా తెలుసా?"

"ఎమ్మెల్యే గా వున్నప్పుడు కలిసిన గుర్తు.కబ్జాల మీద కంప్లైంట్స్ వచ్చినా పొలిటికల్ ప్రెజర్ తో అవన్నీ వెలుగు చూడ లేదు. మళ్ళీ ఈ కేసులోనే కలిసాడు."

"ప్రస్తుతానికి వస్తున్నాను.ఎంఎల్యే బిల్డింగ్ ఒక్కరోజు నాకు హ్యాండ్ ఓవర్ చేయగలవా?దట్ టూ ఇన్ ఎంప్టీ పొజిషన్?"

"సాధ్యం కాకపోవచ్చు. బయటికొస్తే ఆపార్టీ ఎమ్మెల్యేలు గొడవ చేస్తారు."

"అఫిషియల్ గా అయితే నొ ప్రోబ్లం. కమీషనర్ తో మాట్లాడుతాను."

" పోనీ ఒకపని చేయగలవా?మార్నింగ్ టు ఈవెనింగ్ ఎమ్మెల్యేని కమీషనర్ ఆఫీస్ లో కదలకుండా చేసినా చాలు."

"ఓకే ! పాత కబ్జా కేసు ఫైల్ ఓపెన్ చేయిస్తాను. నాఆఫీసుకే పిలిపిస్తాను.యిప్పుడు రూలింగ్ పార్టీ లో లేడు కాబట్టి నోప్రోబ్లం."

“పోతే ఎమ్మెల్యే భార్య కిమ్స్ లో వుంది. డాక్టర్ ని మేనేజ్ చేసి చిన్న ఎమర్జెన్సీ క్రియేట్ చేయిస్తే అనీషా రెడ్డి డ్రైవర్ తో హాస్పిటల్ కు వెళ్తుంది. మిగిలింది సెక్రటరీ కుక్ సెక్యూరిటీ .”

“అది మా పోలీస్ చూసుకుంటారు . “

“గోల్డీవిషయం మాస్టెల్లా శిరీషలు చూసుకుంటారు. “

“ మన ఆపరేషన్ పూర్తి అయ్యేంతవరకు మేటర్ లీక్ కాకూడదు.ఎమ్మెల్యేకి విషయం అస్సలు తెలియకూడదు .”

“బాలి ! ఒకవేళ తెలిసినా కేసు పోలీస్ స్టేషన్లో రిజిస్టర్ అయి వుంది కాబట్టి మా డిపార్టుమెంటు వాళ్ళు అనుమానంతో యాక్షన్ చేపట్టారని చెపుతాము. యూ ప్రొసీడ్. యింతకీ నీ అనుమానం అమ్మాయిని ఇంట్లో బంధించారనా?

“ఎస్ యూ కాచ్ మై పాయింట్.”

*****

కమీషనర్ ఆఫీస్ ..మీటింగ్ హాల్.

సాయుధులైన పోలీస్ ఆఫీసర్లతో హడావిడిగా వుంది. సెలెక్టెడ్ చానెల్స్ కు మాత్రమే ప్రవేశం .డయాస్ మీద పోలీస్ కమీషనర్ బాలి శాండిల్య లతో బాటు ఇద్దరు ముగ్గురు రాజకీయ నాయకులు ఆసీనులయ్యారు. కమీషనర్ మైక్ ముందుకు వచ్చి అందరిని చూస్తూ.

“ఇది ఒక సంచలనాత్మక కేసు. మా డిపార్ట్ మెంటు తీవ్రంగా ప్రయత్నించి ఏమీ చేయలేక చేతులు ఎత్తేసింది. అటువంటిది మిస్టర్ బాలిబృందం మూడు రోజుల్లో పరిష్కరించారు. ఐ యాం వెరీ ప్రౌడ్ అఫ్ దెమ్. అంతేకాదు మా డిపార్ట్ మెంట్ తరఫున హృదయపూర్వక అభినందనలు.”

డిటెక్టివ్ బాలి మైకు తీసుకున్నాడు.

“కమిషనర్ గారన్నట్లు ఈ కేసులో హీరోలం మేముకాదు.ఈ క్రెడిట్ మాది కాదు ” సభలో వున్నవారంతా విస్తుబోయి చూసారు.

“ఎస్ ఐ మినిట్ .అసలు హీరోని మీకు పరిచయం చేస్తాను.”

పిన్ డ్రాప్ సైలెన్స్ .డయాస్ లెఫ్ట్ సైడ్ నుండి గోల్డి తో వస్తున్న స్టెల్లా శిరీషల ను చూస్తూ

“ఈ అమ్మాయిలా హీరోలు ?“ అనుకుంటు విస్తుబోతున్న జనాలను మరింత కన్ఫ్యూజ్ చేస్తూ

“హి ఈజ్ ద హీరో గోల్డి “

అమ్మాయిల చేతుల్లోని కుక్క పిల్లను పైకెత్తి చూపుతూ

“మిస్సయి పోయిన అనుష్కారెడ్డి పెట్..మా కేసులో పెద్ద ట్విస్ట్.

మిస్టర్ శాండిల్యా కేసును మాకు యిస్తూ ఒక్కమాటన్నారు. మేము అన్నికోణాలూ టచ్ చేసామని. పొలిటికల్ ప్రెజర్ మూలంగా టచ్ చేయని కోణాలే ఎక్కువ పోలీస్ కేసుల్లో .

అందుకే మేము మరో యాంగిల్ నుంచి ఫోకస్ చేసాము.

“రామాయణంలో పిడకలవేట” అనుకోకుండా ఈచిన్న కధ వినండి .

“దాదాపు నాలుగు సంవత్సరాల క్రిందట ఎంసెట్లో ఓ ఆటో డ్రైవర్ కొడుకు మనతెలుగు వాడు ఆరో రేంక్ సాధించాడు.మీరంతా మీఛానళ్ళలో ఆకాశాని కెత్తేశారు.”

“అవును సర్ !నాకు గుర్తుంది ..పేరు సారధి ..పార్ధసారధి.”

అతన్ని అతని తెలివి ఆకాశంలో నిలిపితే ..పేదరికం తక్కువ జాతివాడన్న చిన్న చూపు అతన్ని అధపాతాళానికి తొక్కేసాయి.”

“బాలిసర్! యిప్పుడు పార్ధసారధి విషయం ?”

“తప్పదుమరి .. అతనే మన కధలో రియల్ హీరో.”

దాదాపు అందరూ ఆచ్చర్య పోయారు.

“ఇది మా పోలీసులకందని కోణం.”

“కాదు కమీషనర్ సర్ ! అందింది..కానీ తొక్కిపెట్టబడింది.”

అనుష్కారెడ్డి..కనిపించని అమ్మాయి.మనకు కనిపించేది కాదుగానీ గోల్డీకి ప్రతి క్షణం టెన్నిస్ కోర్ట్ లో కనిపించేది.”

“అదెలాసాధ్యం బాలి సర్!”

“గోల్డెన్ రిట్రీవర్ జాతి వేటగాళ్ళకు ట్రాక్ చేయడంలో..స్నిఫ్ చేసి వస్తువుల్ని పసిగట్టడంలో హెల్ప్ చేస్తాయి.అదే పద్ధతిలో భూమిలో పాతిపెట్టబడిన తన యజమానిని గుర్తించి అక్కడే ఉండిపోయింది.”

ఒక్కసారిగా హాహాకారాలు..

"అమ్మాయిని చంపి అక్కడపాతేసారా? షూట్ హిం ఎట్ సైట్?"

కమీషనర్ కోపం తో వూగిపోయారు."

"కమీషనర్ గారూ ! పూర్తిగా వినండి. "

ఆ రోజు తప్పిపోయిన కూతుర్ని వెదికిపెట్టమని ఒకడు ..ట్రిమ్ గా షేవ్ చేసుకొని అట్టహాసంగా కోరమీసాలతో సినిమా విలన్ లా ఆఫీస్ కొచ్చాడు. అప్పటికి కూతురు కనిపించకుండాపోయి పదిహేను రోజులు.ముఖంలో ఆదిగులు కనిపించలేదు.

నేను ఏసిపి గారితో కలిసి తన ఇంటికి వెళి తే ముఖం చూపించడానికి భయపడిపోయి మీటింగ్ లో వున్నానని అబద్ధం చెప్పించి టెన్నిస్ కోర్ట్ లో తిరుగుతున్న మా అమ్మాయిల్ని బైనాక్యులర్స్ తో గమనించాడు.మిస్టరీ టెన్నిస్ కోర్టులో వుందని వాడే చెప్పేసాడు.

అమ్మాయిని చంపి పాతిపెట్టిన చోట రెడీమేడ్ బాత్ రూంలు పెట్టించాడు.

ఆ ఘోరం చూసి షాకై పోయిన భార్యను హాస్పిటల్ లో జాయిన్ చేసి బ్రైబ్ చేసి బయటకు రాకుండా మేనేజ్ చేసాడు. కానీ నోరులేని గోల్డీని మరిచిపోయాడు.

కూతురి ప్రేమ విషయం తెలుసుకున్న వీడు కన్నప్రేమను మర్చిపోయి అహంకారాన్ని పరువు అనే పిచ్చి అపోహను నెత్తికెక్కించుకొని అబ్బాయిని పిలిపించుకొని నమ్మకంగా యిద్దరికీ విషం పెట్టి చంపి టెన్నిస్ కోర్ట్ ప్రక్కనే పాతిపెట్టి చేతులు దులిపేసుకొని ఆషాడభూతి లాగ తనే పోలీస్ లకు రిపోర్ట్ యిచ్చి ..ఇక ఈ కేస్ భూస్థాపితం అయ్యిందని నమ్మి ఏసిపి గారి ద్వారా మమ్మల్ని అప్రోచ్ అయ్యాడు.

యిప్పుడు తెలిసిందా పార్ధసారధి లింక్?

ఆటవిక బావాలతో అర్ధం లేని గొప్పల్ని వూహించేసుకొని పరువు హత్యలపేరుతో మనిషి మృగంలా మారిపోతున్నాడు.

భూమిలోనుండి అనుష్క డెడ్ బాడీ ని బయటకు తీయగానే అరుచుకుంటు వచ్చి మట్టి ని కూడా లెక్కచేయకుండా అనుష్కారెడ్డి ముఖాన్ని నాకేసిన ఈ కుక్క పిల్లలో అమ్మ కనిపించింది గానీ ..జంతువుకాదు.”

మాటలు రాక మూగపోయిన డిటెక్టివ్ బాలి ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ..

మాజీ ఎంఎల్యే ని తనగన్ పెట్టి షూట్ చేయాలన్న కోపాన్ని అణుచుకుంటు ..

“కన్నకూతుర్నికాల రాసిన హంతకుడిని అరెస్ట్ చేయండి “ ఆర్డర్ యిచ్చాడు కమీషనర్.*



ఆకాశమంతా చిక్కని చీకట్లుపరుచుకొని వుంది . వీధిలో అక్కడో దీపం యిక్కడో దీపం వెలుగుతూ చీకటితో పోరాడలేక నీడలను పొడుగ్గా చేసేయి . నిన్న సాయంత్రం పెట్టిన గొబ్బెమ్మల మీద బంతి పూలు యింకా తాజాగా వున్నాయి . ఆ మసక వెలుగులో ఓ ఆకారం అడుగులు గొబ్బెమ్మలపైన పడకుండా జాగ్రత్తగా నడుస్తూ వస్తోంది .

" ఛట్ .. బస్సు తలుపు తియ్యరా , పంతులు సామికి నిద్దరట్టింది కాదు గవాల " అన్నాడు డ్రైవరు అప్పలరాజు .

" గురూ తాగుబోతోడేమోనేస్ " హెల్పరు సింహాచలం సందేహం .

" సాములు మామూలు జోళ్లు యేసుకోరుగదేటి , కర్రజోళ్లు యినాగే సబ్దం సేత్తాయిగాని యెల్లి నువ్వుకూడా సామి తో పాటు బస్సులో తొంగో " " యేటి పంతులు సాములూ నిద్దరరాలేదేటి ? , నిన్నొగ్గేసి యెలిపోతామని భయమేసినాదేటి ? యింత బేగిన పారొచ్చేసినావు " అంటూ రామారావు చేతిలో సామానందుకొని బస్సులోపలకి దారితీసేడు సింహాచలం .

" అదేమీ కాదోయ్ , శరణు ఘోష కి అందరూ లేచిపోతారని " అంటూ ముందుసీట్లో చారబడి కూర్చున్నాడు రామారావు .

బయట కన్నా బస్సులో చలిగావుంది . డిసెంబరు మూడో వారం గుండెలను వణికించే చలి , షాల్ ని పొడుగ్గా కాళ్లమీంచి కప్పుకొని సీట్లో చారబడ్డాడు .గత కొద్దిరోజులుగా రామారావు జీవితంలో జరిగిన మార్పులు అతనిని వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి . ఈ ప్రయాణం ఒక కలలా వుంది , మరో రెండు గంటలలో బస్సు బయలు దేరబోతున్నా అతనికి అపనమ్మకం గానే వుంది . ఆ సంధిగ్దాన్ని తట్టుకోలేకే నాలుగైనా కాకుండా వచ్చి బస్సు లో కూర్చున్నాడు .

యాభైఅయిదేళ్ల రామారావు యిన్ని సంవత్సరాలుగా తనలో నిక్షిప్తంగా వుంచుకొన్న కోరికని నెలరోజులనుంచి ఆచి తూచి జాగ్రత్తగా ఒక్కో అడుగు వేస్తూ గమ్యానికి చేరువగా తెచ్చేడు . ఆఖరి ఆ వొక్క అడుగూ సవ్యంగా పడి బస్సు బయలుదేరిపోతే చాలు .

పెళ్లి కానంతవరకు హనీమూన్ కి భార్యతో కలిసి వెళ్లాలని కలలు గన్న ప్రదేశాలు , పెళ్లైన తరువాత పై జన్మలో మంచి భార్య దొరికితే వెళ్లొచ్చులే అనే నిస్పృహ తో మనసు పొరలలో యెక్కడో సమాధి చేసేసిన కోరిక , ఇప్పుడు అనుకోకుండా యిలా నిజం కాబోతోందనే వూహే రామారావు కి వెన్ను మీద కితకితలు పెడుతోంది .

పెళ్లైన కొత్తలో బామ్మతో ' ఆనందం అప్పుడప్పుడు చెయ్యచేసుకుంటోందే ' అని సిగ్గు విడిచి చెప్పుకుంటే ,      " భడవకానా , ఏకాంతంలోపెళ్లాలు అలాగే వుంటార్రా , వెర్రినాగమ్మా , నేనైతే మీ తాతయ్యని కొరికి పడేసేదాన్ని కాదూ ? " అంటూ యెత్తుగావున్న ముందు పళ్లని నాలుకతో తడుముకుంటూ మురిపెంగా మూతి తిప్పింది .

ఇద్దరు పిల్లల తండ్రయేక నీకోజోహారురా నాయనా " యీ గయ్యాళి గంగమ్మ , యీ బూతుల బుచ్చితో యెలా వేగుతున్నావురా " అని ఆశ్చర్యపోయింది .

" అలా అయోమయంలా గుడ్లుమిటకరిస్తా వేంటిరా , వీళ్లు వాళ్ళు అని తేడా లేకుండా అమ్మా బూతులు తిట్టే వాళ్లని బూతులబుచ్చి అని అంటారులే " అనే వివరణ కూడా యిచ్చింది .

"      నువ్వేకదే దీన్ని నా పీకకి చుట్టేవు , విడిపించుకొనే మార్గం చెప్పి పుణ్యం కట్టుకోవే " అన్నాడు .

" పిల్ల సున్నితమైనా మాటకటువు , మనిషి కాస్త పొట్టయినా జడ పొడవు , కళ్లు చిన్నవయినా పళ్ళు పెద్దవి అని మధ్యవర్తి వర్ణిస్తే యేదో హాస్యం లే పిల్ల చూడ్డానికి చుక్కలా వుంది , పలువరస పెద్దదయినా పెదవుల లోపలే వుంటున్నాయి కదా అనుకున్నాను కానీ మరీ యింతలా అనుకోలేదురా ? అయినా మనచేతుల్లో యేం లేదురా ? అక్కడ ...... అక్కడ ముడి పెడతాడు వాడు " అని ఆకాశం వైపు చూపెట్టింది .

" మరి నా బతుకింతేనేమిటే ? "

" అన్నీ అందరికీ యివ్వడురా , మంచి తెలివి తేటలిచ్చేడా ? , మంచి బాంకిలో వుద్యోగం యిచ్చేడా ? అన్ని మంచులూ నీకే యిచ్చేస్తే మిగతా వాళ్లకో "

" ఎవడే యిచ్చేదీ , కష్టపడి పరీక్షలురాసి పాసయి సంపాదించుకున్న వుద్యోగమే "

" అయ్యో చెవలాయ్ పై వాడురా , శివునాజ్ఞ లేకపోతే చీమైనా కుట్టదుట , అంతా పైవాడి దయ "

" మరి దీంతో యెలా వేగనే , నాకు విముక్తి లేదుటే "

బుద్ధి.... బుద్ధి ....." తను చెంపలు వాయించుకొని , " లెంప లేసుకో యేదో యీజన్మకి యిలా కానీ , పై జన్మలో నైనా మంచి భార్య రావాలని యేదైనా నోము ........." అంటున్నదల్లా మధ్యలోనే ఆగిపోయింది .

నిజమే మగవాళ్లు మంచి భార్యలకోసం యేనోములూ వ్రతాలూ చేసిన దాఖలాలు లేవు . ఈ జన్మకి సరే యెలాగో సర్దుకు గడిపేస్తే మళ్లా జన్మలో నైనా అణకువగా వుండే యిల్లాలు దొరుకుతుందనే గ్యారంటీ యేది ?

అదే విషయం బామ్మని అడిగితే " సన్నాసీ నీలాంటి వాడే అలాంటి నోముని కనిపెట్టాలిరా " అని యెత్తు పళ్లలోంచి క్కె........క్కె.....క్కె అని నవ్వింది .

అప్పటి నుంచి రామారావు మగనోములూ వ్రతాల పుస్తకాలకోసం వెతుకులాట మొదలెట్టేడు . పతివ్రతలకథల పుస్తకాలున్న చోట పత్నీవ్రతుల పుస్తకాల కోసం వెతకేవాడు . పడకగది భాగోతం గది బయటికి వచ్చినంత సమయంకూడా పట్టలేదు వీధికి చేరడానికి . వీధికి చేరిన తరువాత యింట్లో కాకి వాలినా , వీధి లో కుక్క తుమ్మినా ఆనందం నోరు చెలరేగి పోయేది . వాటి మీద కాదు , రామారావు మీద . పాలవాడు నీళ్లపాలు తెచ్చేడనో , పనిమనిషి ఆలస్యంగా వచ్చిందనో రామారావు బుర్ర రామకీర్తన పాడించేది .

రామారావుకు భార్య ప్రవర్తన కన్న పాలవాడు ప్రతీనెలా లెక్క తీసుకుపోతూ ' బాబుగారి మొఖం చూసి మంచి పాలుపోత్తన్నానండి ' అని కిసుక్కున నవ్వడం , పనిమనిషి అంకాలు ' మీ యింటికే బేగిబేగిన లగెత్తుకొచ్చెత్తా గదండి , బాబుగోరిమీన కోపం చేత్తారని గుబులు గందా ' అనడంవొంటికి కారం రాసుకున్నట్లు వుండేది .

భార్య మీద కోపం , వీధిలో జరిగే అవమానం వుద్యోగంలో చూపించ సాగేడు .

ఖాతాదారుల మనస్సుని యిట్టే పట్టేసి యెక్కువ డిపాజిట్స్ పెట్టించడం , టాలీ కాని బేలన్స్ షీటుని నిముషాలలో టాలీ చెయ్యడం అంతెందుకు యే సీటు పని అప్ప చెప్పినా సమర్ధవంతంగా పూర్తి చేసి మంచి పేరు సంపాదించుకునే వాడు రామారావు .

ఉద్యోగంలో ఒక్కోమెట్టు పైకి చేరుతూ డెప్యూటీ జనరల్ మేనేజరు పదవికి చేరుకున్నాడు .

జీవితంలో ఒక్కో మెట్టూ దిగజారుతూ రెక్కలొచ్చిన పిల్లలు స్వంత గూటికి యెగిరిపోగానే కుక్క కన్నా హీనమయిపోయేడు .

వీధిలో యెక్కడయినా పచ్చని తోరణం కనబడిందా యింక అంతే రామారావు తలమీద బొప్పిలు పడ్డాయన్న మాటే తరవాత తిట్లవాన ' నీ వల్లే మనయిల్లు తోరణం కట్టని గడపయింది ' అని అర్థం వచ్చే మాటలు కొన్ని అందులో వుంటాయి .

అంతెందుకు మొన్న కార్తీకమాసంలో యెదురింటి సౌమ్య పెళ్లికి పిలవడానికి వస్తే " ఆఖరుకి యిదిగో వీళ్లు కూడా పచ్చని పందిరి , మావిడాకు తోరణాలు కట్టేరు , నీ పిండాకూడు మనయింట మాత్రం ........." యిది మొదలు మాత్రమే , అలా అలా సాగి సాగి తలపైన నాలుగు బొప్పిలు మిగల్చలేదూ ?

పిల్లలిద్దరూ తమ జీవిత భాగస్వాములని యెంచుకొని ఆ గడపదాటి వెళ్లడంలో తన పాత్ర వుందేమో అన్న విషయం ఆమె కెప్పుడూ తట్టలేదు , తట్టదేమో కూడా .

ఉద్యోగ బాధ్యతలలో మునిగి పోయి మగనోముల విషయం మరుగున పడ్డా యీ మధ్య మళ్లా బయటపడింది .

బ్రాంచి యినస్పెక్షన్ కి వెళ్లిన ప్రతీచోటా పుస్తకాల దుకాణానికి వెళ్లి మగనోములూ పుస్తకాలు వెతకడం చెయ్యసాగేడు . మగదేముళ్ల నోముల పుస్తకాలు పుష్కళంగా దొరికేయి . చిత్రగుప్తుడి నోము , నందికేషుడినోము లాంటివి . ఆఫీస్ రూములో రహస్యంగా చదివితే తెలిసిందేవిటీ అంటే దేముళ్లు మగవారైనా అవి ఆడవాళ్లు నోచుకునే నోములని . నవగ్రహ జపాలు లాంటి పుస్తకాలు వున్నా అవి ఈ జన్మలో గ్రహశాంతికి తప్ప పై జన్మ ఖాతాలో కి పుణ్యం ట్రాన్స్ఫర్ చేసే శక్తి గ్రహాలకు లేదని కొంత పరిశోధన చేసేక తెలుసుకున్నాడు .

ఈ నోములూ వ్రతాలూ మొదలు పెట్టిన కాలంలో చెడ్డ భర్తలే కాని చెడ్డ భార్యలు వుండేవారు కాదా ?

ఆపద మొక్కులవాడు యినిస్టెంటుగా కోరికలు తీరుస్తాడు కాబట్టి తనకి పనికిరాడు , వినాయకుడు అతను అంతే కార్యసిద్ధి కలుగ జేస్తాడు అంటే యీ జన్మలోనే ,

యిలా చూసుకుంటూ పోతే మనషులే కాదు దేముళ్లుకూడా మహిళా పక్షపాతులే అని తనకు పనికిరారని డిసైడ్ అయేడు .

తనకు పై జన్మలో కూడా గయ్యాళి భార్య తప్పదనే నిశ్చయానికి వచ్చి నిరాశ లో కూరుకు పోతున్న తరుణంలో చిన్న ఆశాకిరణం బ్రాంచి మేనేజరు రవి రూపంలో వచ్చింది .

" సార్ యీ ఆదివారం మధ్యాహ్నం మాయింట్లో భోజనానికి రావాలిసార్ " అన్నాడు రవి ,ఇనస్పెక్షన్ ముగించుకొని హెడ్ ఆఫీసుకి బయలుదేరుతున్న రామారావు తో .

"ఏమిటయ్యా విశేషం , స్వతంత్రం కోల్పోయిన రోజా ? "

" మాల వేసుకున్నా సార్ , అలాంటి మాటలు వినకూడదు , మట్లాడకూడదు సార్ "

రవి నల్ల దుస్తులు ధరించి వుండడం అప్పుడు గమనించేడు రామారావు .

" అయ్యప్ప బ్రహ్మచారి కదయ్యా , మాల వేసుకుంటే మాత్రం సంసారుల కోరికలు తీరుస్తాడా ? యెందుకు తీరుస్తాడు ? " రామారావు సందేహ నివృత్తికి అడిగినా రవి కాస్త తడబడ్డాడు . పక్కింటి వాడు వేసుకున్నాడని , యెదురింటివాడు వేసుకున్నాడని తాను కూడా వేసుకున్నాడు గాని యెందుకు , యేమిటీ. అనే ప్రశ్నలకి రవి దగ్గర కూడా సమాధానంలేదు . కాని పైకి " మాల వేసుకున్న నాటినుంచి బ్రహ్మచర్యం అవలంబిస్తాము కదా , అలా దీక్ష సాగిస్తే స్వామి మెచ్చుకొని మనకి కావలసినవి యిస్తాడు " అని మెల్లగా నచ్చచెప్తున్నట్టుగా అన్నాడు

" ఈ దీక్ష పుణ్యం మళ్లా జన్మ వరకు వుంటుందా "

అలా రామారావు యెందుకు అడిగేడో తెలియక పోయినా , యెక్కడో తను చదివిన ' అయ్యప్ప మహత్యం ' కథ లో మండల దీక్ష చేపట్టిన వారి యేడు జన్మల పాపాలు పోతాయి అనే వాక్యం గుర్తొచ్చి " ఔను సార్ యేడు జన్మల పాపాలు పోవడమే కాక యీ పుణ్యం వచ్చే యేడు జన్మలదాకా వుంటుంది " సొంత పైత్యం కాస్త జోడించి నమ్మకంగా చెప్పేడు .

రవి మాటలతో యీ జన్మ కి యింతే అనే నిరాశ లో కూరుకుపోతున్న రామారావు కి గడ్డిపరక దొరికినట్లయింది . కాని శిఖండిలాంటి ఆనందాన్ని వొప్పించడం యెలా ?

రవి సహాయంతో ఆదివారం రంగం సిద్ధంచేసేడు .

ముందుగా అనుకున్నట్టుగా ఆదివారం భార్యా సమేతంగా రవి యింటికి వచ్చేడు రామారావు .

ప్రతీ నిమిషం తన భార్య కాబట్టి చేసిందిగాని మరెవ్వరూ చెయ్యరని , చెయ్యలేరనీ అంటూ అందరిలోనూ భార్యను ఆకాశానికి యెత్తెయ్యసాగేడు రవి .ఈ ట్రేప్ తనకోసమే అని తెలియని ఆనందం అందులో పడింది .

ఇరు ముడి సమయంలో కొత్త స్వాములు మాలలు వేసుకోడం ఆనవాయితీ కావడంతో మాల వేసుకొనే వారు రమ్మని పిలుపు రాగానే రామారావుని ముందుకితోసింది ఆనందం .

రవి రామారావు దంపతులని లోనికి తీసుకువెళ్లి " అక్కయ్యా నీ వల్లకాదు , ఒకటా రెండా నలభై రోజులు , పొద్దున్న సాయంత్రం చన్నీటి స్నానం , మడి వంట , చాపమీద పడక యివన్నీ నీ వల్ల కావుగాని వద్దులే , బావగారి తో ఆ మధ్య మాల సంగతి చెపితే మీ అక్క చెయ్యగలిగినా నావల్ల కాదయ్యా అన్నారు " అన్నాడు .

ఆనందానికి కోపం వచ్చింది , గొరగొరా భర్తని లాక్కెళ్లి మాల వేయించింది .

నాటకం లో రెండో అంకం రామారావుది , అనుమానం రాకుండా యెక్కడా అతి కి పోకుండా జాగ్రత్తగా ఆడి యిదిగో యిలా రక్తి కట్టించేడు .

పై జన్మ కోరిక సంగతేమో కానీ యీ జన్మలో చూడలేననుకున్న కేరళ అందాలని తనవితీరా చూసి రావాలని కలలు కనసాగేడు .

కలలలో తేలుతున్న రామారావు కి చిన్న కునుకు పట్టడంతో అనుకున్న సమయానికి అందరూ రావడం గాని బస్సు బయలుదేరడం గాని తెలియలేదు .

బయలుదేరిన అరనిముషానికి షడన్ బ్రేకు వేసిన కుదుపుకు తుళ్లి పడిలేచిన రామారావు కళ్లకి ఒకచేత్తో సూటుకేసు , మరోచేత్తో చిన్న బేగులో బస్సెక్కిన ఆనందం కనిపించింది .

అంతే రామారావు కళ్లు పత్తికాయల్లా విచ్చుకొని , తెరచుకున్న నోరు తెరుచుకున్నట్లుగా వుండిపోయింది .

బస్సులో వారి పరిస్థితి అంతే .

విషయం తెలిసిన అప్పలరాజు మంచి శకునం " ఆడస్వామి " యెదురొచ్చినాది అని లెంపలు వేసుకొని " స్వామియే " అని గట్టిగా అంటూ బస్సు ని ముందుకి వురికించేడు . రామారావు తప్ప అన్ని గొంతులూ " శరణమయ్యప్పా " అన్నాయి .




తన తాతగారు కట్టించిన పాత పెంకుటిల్లు తన తండ్రి హయాంలో ఆర్ సి సి ఇంటిగా మారితే, భైరవమూర్తి దాన్ని ఇంకాస్త ముందుకు పెంచి, పైన ఓ పోర్షన్ వేసి,ఇంకొన్ని హంగులు అమర్చుకుని, పాడుపడిన కాంపౌండ్ వాల్ మళ్ళీ కట్టించి అందమైన రంగులు వేయించాడు ఓ ఆర్నెల్ల క్రితం. అంతకుముందు ఆ ఇంటిమీద అంత శ్రద్ధ పెట్టకపోయినా, ఇప్పుడు మంచి అందంగా ఇల్లు కనబడుతుండడంతో రోజూ ఆ ఇంటి సంస్కరణ బాధ్యత నెత్తినేసుకున్నాడు. కాంపౌండ్ వాల్ బయట "ఇచ్చట నోటీసులు, సినిమా పోస్టర్లు అంటించరాదు, ప్రకటనలు వ్రాయరాదు. నో పార్కింగ్" అని వ్రాయించాడు. అయితే రోజూ ఎవరో ఒకరు తన గోడ నానుకున్న డ్రైనేజ లోనికి మూత్రవిసర్జన చేస్తుంటే వాళ్ళ మీద అరిచేవాడు. వాళ్ళు కాస్త సిగ్గు పడి సారీ చెప్పి వెళ్ళిపోయేవారు. గతంలో కూడా అలానే జరుగుతున్నా, తన ఇల్లు రీమోడల్ చేయించక ముందు బయట వాతావరణం కూడా అంత బాగుండక పోవడంతో భైరవమూర్తికి ఇప్పుడు కలిగినంత శ్రద్ధగా గమనించే అవసరం రాలేదు. ఇంకొకరోజు కూడా ఎవరో ఆ పనే చేస్తుంటే చూసి అలానే అరిచాడు.

"ఏం సార్! ఇదేమన్నా మీ ఇల్లా!? మున్సిపల్ డ్రైనేజి. అందులో పోస్తే మీకేంటి? అయినా ఏళ్ల తరబడి అందరూ ఇలా రోడ్ పక్కనే పోస్తున్నారు. ఇవాళ కొత్తగా అడుగుతారేం?"అని పోస్తూ పోస్తూనే భైరవమూర్తి వేపు తిరిగి మరీ తిరగబడ్డాడు అతను.
"ఛీ!ఛీ!! సిగ్గులేకపోతే సరి. అసహ్యంగా నావేపు తిరుగుతావేంటి? పైగా ఆ తలపొగరు సమాధానం ఒకటి! ... డ్రైనేజి లో పోస్తే!? అది మా ఇంటిముందే కదా ఉన్నది. ఆ కంపు భరించేది మేమే కదా?" అని ఇంకొంచెం గట్టిగా అరిచాడు భైరవమూర్తి

“అది నాకనవసరం. నా కర్జెంటయింది. మీ ఇంట్లోకొచ్చి పోయలేదుకదా!?ఇది ఓపెన్ డ్రైనేజి. నా ఇష్టం. మీరేం చేస్కుంటారో చేస్కోండి. నాకు తిక్కరేగితే రోజూ ఇక్కడికేవచ్చి పోసి పోతా. ఈ వార్డ్ కార్పొరేటర్ నా బాబాయే. అతనితోచెప్తే అసలు మీ కాంపౌండ్ వాల్ ఈడ్రైనేజిని కొంత కబ్జాచేసికట్టారని దీన్ని కొట్టించేసినా ఎవడడిగేవాడుండడు!!” అని ఇంకొంచెం రెచ్చిపోయాడు అతగాడు సిన్మాల్లో అసిస్టెంట్ విలన్లా.

ఊహించని ఈ ఎదురుదాడికి బిత్తరపోయిన భైరవమూర్తి, ఏదో అనబోయేలోగా, అతను ఆ ఇంటిగోడని ఓసారి పరిశీలనగా చూసి, నవ్వుతూ ‘అయినా ఇక్కడ మీరు నోటీసులు, సినిమా పోస్టర్లు అంటించరాదు, నో పార్కింగ్ అని వ్రాశారు గానీ “మూత్ర విసర్జన చేయరాదు” అని వ్రాయలేదు కదా? అంచేత నా తప్పేంలేదు’ అని చక్కా పోయాడు.

వార్నీ..ఇన్ని వ్రాసినా ఇంకా అలా వ్రాయలేదని ఇలా చేసిపోతారా? అని నెత్తి బాదుకుని, మళ్ళీ పెయింటర్ని పిలిపించి “ఇచ్చట మూత్రవిసర్జన చేయరాదు” అని వ్రాయించాడు భైరవమూర్తి.

===========

అయినా పరిస్థితిలో మార్పులేదు. చట్టం తనపని తాను చేసుకుపోతుంది అని నాయకులు చెప్పేరీతిని, ఎంతమంది లంచగొండులు ఎసిబికి దొరికినా ఏమీ తగ్గని లంచగొండితనంలా, జనాలు యధేచ్చగా వాళ్ళ పని వాళ్ళు కానిచ్చేసిపోతున్నారు. ఎందుకిలా ఎవరూ లెక్కచెయ్యడం లేదని చూస్తే.. ఎవరో ఆకతాయి పని చేసినట్టున్నారు, ఆ ప్రకటనలోని చివరిపదం “చేయరాదు లో ‘దు’ ని చెరిపేశారు. లబో దిబో మని ఆ అక్షరాన్ని తానే మళ్ళీ జాగ్రత్తగా వ్రాశాడు భైరవమూర్తి

ఓ రెండ్రోజులు బాగానే గడిచిపోయాయి. భైరవమూర్తి చూస్తుండగా ఎవరూ ఆ పని చేయలేదు. హమ్మయ్య అనుకునేలోగా ఇంకొకాయన తన కుక్కని తీసుకొచ్చి తన ఇంటిగేటు దగ్గర దానిచేత రెండు పన్లూ చేయిస్తుండగా చూసి పట్టుకున్నాడు. “ఏం చెయ్యను సార్. దీనికి మలబద్ధకమో ఏమో గానీ, రెండ్రోజుల్లై ఊరంతా తిప్పుతున్నా దాని కడుపు కదలలేదు. ఈరోజు మీ గేటు వాసనచూశాక దానికి కడుపు ఖాళీ అయిపోయింది. కొత్త పెయింటా? సూపరుంది. దీనికీ బాగా నచ్చినట్టుంది. ఏ కంపెనీ పెయింటండీ?నేను ఇదే మా ఇంటిగేటుకి వేయించేస్తా! ఇంక నాకు వీధి వీధీ, ఇల్లిల్లూ ఇలా దీన్ని పట్టుకుతిరిగే బాధ తప్పుతుంది. “ అంటూ ఏక బిగిన భైరవమూర్తి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా, అతన్ని పొగుడుతున్నాడో, తనపనిని సమర్ధించుకున్నాడో తెలినిరీతిలో సమాధానం ఇచ్చాడు ఆ పెట్ డాగీశుడు. ఏమనాలో తెలిక బుర్ర గోక్కుని, “సర్సర్లెండి. మరీ ఇలా గేటుమీంచి పోయించకండి!” అని అతన్ని పంపేసాడు. ఎందుకేనా మంచిదని గోడమీద “మూత్ర విసర్జన చేయరాదు” అన్న వాక్యం పక్కనే..”చేయించ రాదు” అని అదనం గా వ్రాయించాడు.

==========

మర్నాడు ఒకాయన తన పిల్లాడ్ని ఆ డ్రైనేజి ఒడ్డుని కూర్చోబెట్టడం చూసి ఆయనమీదికి జువ్వలా దూసుకెళ్లాడు, " ఏమయ్యా! బుద్ధి లేదూ? ఓ పక్క స్వచ్ఛ భారత్ అని ప్రభుత్వం మొత్తుకుంటూంటే, నువ్వేంటి మీ పిల్లాడ్ని ఇలా కాలవలోకి కూర్చోబెట్టావు?" అని.

“అయ్యా! మాదీవూరు కాదు. తెల్లారి బస్ దిగి ఇలా పోతున్నాం. ఈలోగా ఈ పిలగాడు అర్జంటంటే ఇక తప్పక, ఇక్కడ కూర్చోపెట్టాను. రోజూవచ్చి ఇక్కడే పని కానిచ్చేస్తున్నట్టు అలా కసురుకుంటారేం? అయినా డ్రైనేజి లోకే కదా పోయేది. అదేదో మీ ఇంట్లోకొచ్చినట్టు అరుస్తారేం?” అని ఎదురుదాడికి దిగాడు ఆ ఆసామీ. “ఇదే మీ వూర్లో,మీ ఇంటి దగ్గర ఇలా ఎవరైనా చేస్తే ఊరుకుంటావా? అని వదిలిపెట్టకుండా లా పాయింట్ లాగినట్టు అడిగాడు భైరవమూర్తి.

తన బేగ్ లోంచి వాటర్ బాటిల్ తీసి, పిల్లాడిని కడిగేస్తూ “ఎందుకూరుకుంటాం సార్? ఊరుకోం! మీలానే నిలదీసి అడుగుతాం. వాళ్ళూ నాలానే పనైపోయాక సారీ! ఇంకెప్పుడూ ఇలా చెయ్యం, ఇంకోలా చేస్తాం! అని సారీ చెప్పి అక్కడనుండి జారుకుంటారు” అని చెప్తూనే కొడుకుని తీసుకు చక్కా జారుకున్నాడతను.

=============

మళ్ళీ ఏం చెయ్యాలో తోచక జుట్టు పీక్కున్నాడు భైరవమూర్తి. ఇంతకీ ఈఇబ్బంది తనకొక్కడికేనా, మిగతా వాళ్ళకిక్కూడానా? అనుకుంటూ, తన వీధిలోని ఇతర ఇళ్లు చూశాడు. ఆ వీధిలో చాలా వరకు అపార్ట్మెంట్లు, వాటికి వాచ్ మన్ ఉండడంతో ఎవరూ ఆ ఇళ్ల ఛాయలకి పోవడం లేదు. రెండు మూడిళ్లు ఇండిపెండెంట్ వి అయినా, అవి ఒకప్పటి తన పాత ఇల్లు లాగా ఉండడంతో వాటి బయట ఎవరేం చేసినా పట్టించుకోవడం మానేశారు వాళ్ళు.

స్నేహితులని సలహా అడిగాడు, ‘మీరైతే ఏం చేస్తున్నార్రా!?’ అని. వాళ్ళలో చాలా మంది అపార్ట్ మెంట్ వాసులవడం వల్ల ఆ సమస్యే లేదు వాళ్ళకి. ఏమున్నా వాచ్ మన్ చూసుకుంటున్నాడు. ఇంకొంతమంది “దీనికింత వర్రీ దేనికిరా? మొన్నమొన్నటి దాకా మనం ఇలానే చేసేవాళ్లం కదా. ఇప్పటికీ ఎక్కడికో వెళ్ళివచ్చేటప్పుడు, అక్కడ అవకాశం లేకపోతే మనమూ ఇలా రోడ్ సైడ్ నే కానిచ్చేస్తున్నాం కదా?” అని ఇది అష్టావధానం లో అప్రస్తుత ప్రశంస లాంటిదన్నట్టు సమాధానాలు చెప్పారు. “పోనీ సి సి కెమెరాలు

పెట్టించు"     అని ఉచిత సలహా పారేశాడు ఓ స్నేహితుడు. "ఆ!!.. మళ్ళీ అదో దండగమారి ఖర్చు.     పైగా ఎవడు పోస్తున్నాడో వాడ్ని చూస్తూ కూర్చుంటాడా వీడు అసహ్యంగా!" అని ఓ సందేహాన్ని కూడా లేవనెత్తాడు ఇంకో మిత్రుడు.     పోనీ అవి ఉన్నట్టు "ఈ ప్రాంగణం సిసికెమెరాల పర్యవేక్షణలో ఉన్నది" అని ఉత్తినే బోర్డ్ పెట్టు అని ఇంకో ఉచితం పారేశాడు ఇందాకటాయన.

"సర్లే! అది ఇంకా డేంజర్. మొన్న మా బామ్మర్ది ఇలానే తనింట్లో కుక్క లేకపోయినా,     'కుక్క ఉన్నది జాగ్రత్త!' అని బోర్డ్ పెట్టాడు. అది చూసి దొంగవెధవలు, వీడిదగ్గరెంత డబ్బు,బంగారం లేకపోతే కుక్కని పెంచుకుంటాడు? అని అనుకుని, ఓ రాత్రి మత్తుమందు జల్లిన కుక్కబిస్కట్లు పట్టుకొచ్చి ఇంటి ఆవరణ అంతా జల్లారు. కానీ,     ఎక్కడా కుక్క జాడ లేకపోయేసరికి, యధేచ్చగా ఇల్లు మొత్తం దోచుకుపోయారు.     ఇప్పుడు కూడా సిసి కెమెరాలు ఉన్నాయన్న బోర్డ్ చూసి, వీడెవడో బాగా బలిసినవాడు కాబోలు అని ఏదో ఓరోజు ఏ దోపిడీ ముఠానో దిగిపోగల్దు. అలాంటి పిచ్చిపని చెయ్యకు. ఎందుకొచ్చిన గొడవరా. పోసే వాళ్ళు పోసుకు పోనీ. లేదా ఓ పని చెయ్యి. కాంపౌండ్ వాల్ కి బయటవేపు దేవుళ్ళ బొమ్మలు అతికించు. అది చూసి ఎవరైనా దేవుడి మీది భయభక్తులలోనైనా ఆ పని మానుకుంటారు." అని చివరాఖరికి ఓ తరుణోపాయం చెప్పాడు ఇంకో ప్రాణ స్నేహితుడు.

=============

ఇదేదో బాగుంది అని వెంటనే కొన్ని దేవుళ్ళ బొమ్మలున్న టైల్స్ తెప్పించి అక్కడక్కడ అతికింపించాడు భైరవమూర్తి. ఆ ప్రక్రియ బానే పని చేయడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. ఓ పదిరోజులు గడిచాయో లేదో, ఓ రోజుాదయాన్నే హఠాత్తు గా ఓ అయిదుగురు ఫలానా ధార్మిక సంఘం నేతలమని చెప్పుకుంటూ భైరవమూర్తి     ఇంటికి వచ్చి" అలా దేవుళ్ళ బొమ్మలు వీధి కాంపౌండ్ కి అతికించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. తను ఆ పని చేసిన కారణం చెప్పాక వాళ్ళకి ఇంకా కోపం ఎక్కువైపోయింది. "ఇంత వయసొచ్చింది, కానీ బుద్ధి వచ్చినట్టులేదు మీకు. అవి అక్కడ అతికించిన తర్వాత మీ సమస్య తీరిపోయిందనుకుంటున్నారా? ఇప్పుడు మీ ఇంటికొస్తుంటే ఒక చిన్న పిల్లాడు అక్కడే పాస్ పోస్తూండడం చూశాం. ఆ పాపం మీదే. రోజూ ఆయా దేవుళ్ళకి మిరిచ్చే ధూపం ఆ కాలువ మురికి కంపా? అందులో కొట్టుకువచ్చే చెత్త నైవేద్యమా?     వెంటనే ఆ దేవుళ్ళ బొమ్మలు తీసివేయకపోతే మీకు రౌరవాది నరకాలు ప్రాప్తిస్తాయి." అని డెవోషనల్ మెయిలింగ్     చేసి అతన్ని భయపెట్టి వెళ్లారు. దాంతో హడలిపోయి, వాటిని వెంటనే తీసివేశాడు. ఇంక వాళ్ళని, వీళ్లని అడిగిప్రయోజనం లేదు, నేనే ఏదో ఒకటి చెయ్యాలి అని బాగా ఆలోచించి ఒక నిర్ణయానికొచ్చాడు భైరవమూర్తి

=============

"ఒరేయ్ సుద్దూ!     గుడ్ న్యూస్!! నాన్నగారికి రాష్ట్రప్రభుత్వం వారు సన్మానం చేస్తారటరోయ్!" అని సుద్దూ అనబడే సుధీర్ చెవి కన్నంపడేలా ఫోన్లోనే     సైరన్లా ఓగావుకేక పెట్టింది     సైరంధ్రీబాయి అనబడే భైరవమూర్తి ధర్మపత్ని

“అబ్బా! నీ పేరుకు తగ్గట్టు ఎప్పుడుమాట్లాడినా సైరన్ మోత లాగే ఉంటుందమ్మా నీ గొంతు. కాస్త మెల్లగా చెప్పొచ్చుగా ఏద్దైనా!? ఇంతకీ నాన్నకి సన్మానమేమిటమ్మా?ఆయనగారేమంత ఘనకార్యం చేసారూ? ఓ రచయితా, నటుడూ కాదు. సంఘ సంస్కర్తా కాదు. స్పోర్ట్స్ మన్ అసలే కాదు పైగా స్పోర్టివ్ నెస్ లేనేలేదు. ఎప్పుడూ అందరి మీదా చిర్రు బుర్రు లాడుతూ ఉంటారు. అందుకని ‘చిరాకుశ్రీ’ అన్న బిరుదులో గాని ఈయనకి సన్మానం చేస్తారా ఏం? నేన్నమ్మను” గుక్క తిప్పుకోకుండా వరస ప్రశ్నలు సంధించాడు సుధీర్.

“ఒరే! ఇది పాత అయిదొందలు, వెయ్యినోట్లు చెల్లవన్నంత అన్నంత నిజం. రాహుల్ గాంధీకి ఇంకా పెళ్లికాలేదన్నంత నిజం. ఇంకేం మాట్లాడకుండా నువ్వు వచ్చే ఆదివారం సెలవు పెట్టుకురా! అవాళే మీ నాన్నగారికి సన్మానం.”

“ అబ్బా! నాన్నకి సన్మానం అనగానే నీకు మతి పోయినట్టుంది. ఆదివారం సెలవు పెట్టుకోవడం ఏమిటి.? ఆ రోజు సెలవేగా అందరికీ!” అన్నాడు

“ నాకు కాదు నీకే మతి పోయింది. ఎప్పుడూ శనాదివారాలు రమ్మన్నా, “కుదరదమ్మా, ఈ శనాదివారాలు ఆఫీసులో చాలాపని ఉంది. మా బాస్ కూడా ఆఫీసుకి వస్తున్నాడు. ఇంకోసారి చూద్దాంలే!” అనంటుంటావుగా?

అందుకే ఆదివారం అయినా సెలవు పెట్టి రమ్మంది.” అని ఛాన్స్ దొరికింది కదాని సుధీర్ ని దొరకపుచ్చుకుంది సైరంధ్రీని బాయి. అసెంబ్లీ లో పొరపాట్న ప్రతిపక్షానికి దొరికిపోయిన పాలక పక్ష మంత్రి గారిలా, క్షమార్పణ చెప్పీ చెప్పకుండా దాటవేస్తూ, “ఓకే ఓకే ఇంతకీ సన్మానం దేనికో చెప్పలేదు నువ్వు.” అనడిగాడు సుధీర్.

“అది సస్పెన్స్ రా. ఇక్కడికొస్తేనే నీకు తెలిసేది. నువు రావాల్సిందే!” అని సుధీర్ ఇంకేం మాట్లాడానికి అవకాశం ఇవ్వకుండాఫోన్ కట్ చేసేసింది సైరంధ్రీనిబాయి.

=============

అనుకున్న ఆ ఆదివారం నాడు సుధీర్ నాన్న అయిన భైరవమూర్తి కి ప్రభుత్వంతరపున ఆ నగర పాలక సంస్థ వారు ఇంకా కొందరు

ఇతర సంఘసంస్కర్తల తో పాటు ఘనసన్మానం చేసి, వాళ్ళు చేసిన ఘనకార్యాలని ముక్తసరిగా, మొక్కుబడిగా పొగిడి, ఒక చెక్కు ముక్కా(నగదు), ఒక చెక్క ముక్కా(మొమెంటో), ఒక గుడ్డ ముక్కా (షాల్) తో ఇంటికి సాగనంపారు.

కష్టపడి ఆ ఆదివారం "సెలవు" పెట్టుకు వచ్చిన సుధీర్ ఆ సన్మాన కార్యక్రమం చూసినా అతనికి అదంతా ఒక కల లాగా ఉంది. కానీ నాన్న కట్టించిన ఆ మరుగు దొడ్డి ఇంటి కాంపౌండ్ వాల్ నానుకుని ఎదురుగా కనబడుతుంటే. నిజమని నమ్మక తప్పలేదు. దీనికే అంత సన్మానామా!? అని ఆశ్చర్యపోతూ, "ఇంతకీ ఆ మరుగుదొడ్డి సన్మానం మరుగున ఉన్న కథేంటి నాన్నా!" అని ఆరా తీశాడు కుతూహలం గా. పైగా రేపు తన ఆఫీస్ లో వాళ్ళ బాస్ కి చెప్పాలి గా. ఈ నెపం మీదే ఆ ఆదివారం వచ్చాడు మరి.

జీవితంలో మొదటిసారిగా తనకు జరిగిన ఆ సన్మానం తాలూకు అనుభూతి నుండి ఇంకా బయటికి రాని భైరవమూర్తి వేసవికాలపు ఉక్క లోపల చంపేస్తున్నా తన భుజమ్మీది సన్మాన శాలువా ఇంకా తియ్యనే లేదు.. దాన్ని సవరించుకుంటూ సుధీర్ కి తమ ఇంటి కాంపౌండ్ వాల్ దగ్గర ఊరి జనాల కార్యక్రమాలన్నీ చెప్పి.. "ఇంక వాళ్ళతో విసిగిపోయి వాళ్ళ అవసరాలకి నేనే ఒక మరుగుదొడ్డి కట్టించేస్తే మంచిదని ఆ పనిచేసాన్రా. అది వాళ్ళకి బాగా అర్ధమవాలని "ఇది సులబ్ కాంప్లెక్స్ కాదు. కానీ మీరు మీ అత్యవసర కాలకృత్యాల కొరకు ఈ ఉచిత మరుగుదొడ్డిని ఉపయోగించవచ్చును. దయచేసి దీనిని పరిశుభ్రంగా ఉంచండి. స్వచ్ఛభారత్ వైపు ఓ అడుగు ముందుకెయ్యండి!" అని కూడా వ్రాయించా. అది ఆ నోటా ఈ నోటా పాకి మన పూరి మేయర్ గారి దృష్టి కెళ్లింది. ఆయనోరోజు నన్ను పిలిపించి, ఆ పని ఎందుకుచేశానో తెలుసుకుని, నన్ను కాసేపు పొగిడి, ఈ మరుగుదొడ్డిని తన పురపాలక సంఘ ఖాతాలో వేసుకుంటామని, ప్రతిగా నాకు సన్మానం చేయిస్తామని మెలిక పెట్టాడు. పెద్దవాళ్ళతో పెట్టుకుంటే ఏమవుతుందో ఏమో నని సరేనన్నాను."అని చెప్పాడు భైరవమూర్తి తన మరుగు దొడ్డి కధ.

"ఇదేదో బావుంది నాన్నా. నేనూ మా బాస్ తో చెప్పి మా కంపెనీ తరఫున సిటీ లో ఇంపార్టెంట్ ప్లేసెస్ లో కొన్ని పబ్లిక్ టాయిలెట్స్ ఇలా కట్టిస్తే కంపెనీకి మంచి పేరొస్తుందని చెప్పి ఒప్పిస్తా. తద్వారా నాకు ప్రొమోషన్ ఇచ్చినా ఇస్తారు." అని ఆనందపడ్డాడు సుధీర్.

=============

ఓ రెండ్రోజుల తర్వాత, ఓనాడు మార్నింగ్ వాక్ కని బయటికొచ్చిన భైరవమూర్తికి మళ్ళీ ఎవడో ఆ టాయిలెట్ గోడని బయటనుండే తడిపేస్తూండడంతో నిర్ఘాంతపోయి,'ఒరే! చచ్చి చెడీ మీలాంటి వాళ్ళకోసమే ఇది కట్టిస్తే మళ్ళీ మొదటికొచ్చారేం రా మీరు!?' అని అతనిమీద అరిచాడు. ఈసారి సైరంధ్రిని బాయి కూడా తన సైరన్ మోగించింది తోడుగా.

"సారీ సార్. చాలా అర్జంటైంది. తలుపు తీసుకు లోపలికెళ్లే టైం లేక ఇలా..." అని సమాధానమిచ్చాడు అతను... తీరుబడిగా తన పనికానిస్తూ. "అయ్యో!! ఇలాంటి వాళ్ళున్న ఈ దేశం స్వచ్ఛభారతంగా ఎప్పటికయ్యేను దేవుడా!!?" అని టాయిలెట్ గోడ కేసి తల బాదుకున్నాడు భైరవమూర్తి నిస్సహాయం గా.




మురళి తన పెళ్ళి పత్రిక ఇస్తుంటే అతని స్నేహితులు ఆశ్చర్యపోయారు.

ఉండదా మరి...?

నాలుగైదు చోట్ల పెళ్ళి చూపులకు వెళ్ళొచ్చి...అందులో కొంతమందిని ఓకే చేసిన తరువాత సడన్ గా ఓకే చేసిన వారందరినీ వద్దని నిరాకరించాడు మురళి.

ఒకమ్మాయితో పెళ్ళి కుదుర్చుకుని, ముహూర్తం కూడా ఖాయం చేసుకున్న తరువాత, ఆ అమ్మాయిని కూడా చేసుకోనని చెప్పి పెళ్ళి క్యాన్సల్ చేశాడు. ఇది చాలా తప్పురా అని ఎంతమంది చెప్పినా ఒప్పుకోలేదు.

అలా ఎందరో అమ్మాయిలను చూసి, మొదట ఓకే చేసి ఆ తరువాత వద్దు అనడానికి కారణమేమిటని అందరూ అడిగారు.

ఎవరికీ కారణం చెప్పని మురళి తన ప్రాణ స్నేహితుడు కిరణ్ కి మాత్రం ఆ రోజు కారణం చెప్పాడు.

"పోయిన వారం పెళ్ళి చూపులకు వెళ్ళానే...ఆ అమ్మాయి బాగుంది. నాకు అన్ని విధాలా నచ్చింది. అందుకే ఓకే చెప్పాను. తరువాత ఒక రోజు వాళ్ళ ఆఫీసుకు వెళ్ళాను. నన్ను గుర్తుపట్టి పలకరింపుగా నవ్వింది. మాట్లాడాను. సినిమాకు వెడదాం రమ్మని అడిగాను....వెంటనే వస్తానని ఒప్పేసుకుంది..."

"ఇంకేరా...నీ మాటకు గౌరవం ఇచ్చింది కదా...మరి అలాంటి అమ్మాయిని ఎందుకు వద్దన్నావు?"

“ఎంత పెళ్ళి చేసుకోబోతున్న వాడినైనా, అలా పిలిచిన వెంటనే వచ్చే అమ్మాయి....ఇదేలాగా ఇంకొకడితో ఊరు తిరిగుండదని ఏమిటి నమ్మకం. అందుకే ఆ అమ్మాయిని చేసుకోనని చెప్పాను"

“ఇంతకు ముందు ఓకే చెప్పి తరువాత వద్దన్నావే ...వాళ్లను కూడా ఇలాంటి కారణానికేనా"

"ఇంచుమించు"

"రేయ్ అయితే ఈ జన్మలో నీకు పెళ్ళి కుదరదురా"

"అందరూ ఇలాంటి అమ్మాయిలే ఉంటారా ఏమిటి"

" నేను చెప్పింది అమ్మాయిల గురించి కాదు...నీ అనుమాన స్వభావం గురించి"

"ప్రాణ స్నేహితుడివైన నువ్వు కూడా నన్నే శపిస్తున్నావా?' అంటూ స్నేహితుడు కిరణ్ పై కోపగించుకుని వెళ్ళిపోయాడు మురళి.

అలాంటి మురళి ఈ సారి చూసిన అమ్మాయి బాగా నచ్చిందని, పెళ్ళి పత్రికతో పిలవటానికి రావటం మరి అందరినీ ఆశ్చర్యంలోకి తోయదా?

"ఈ సారి పెళ్ళికి ఓకే చెప్పటమే కాకుండా, పెళ్ళి పత్రిక వరకు వచ్చావు...ఎలా" అని ప్రాణ స్నేహితుడు కిరణ్ అడిగినప్పుడు "నేను పెట్టిన పరీక్షలో ఈ అమ్మాయి గెలిచింది" అన్నాడు మురళి.

******

పెళ్ళి జరిగింది...ఆ రోజు మురళికి ఫస్ట్ నైట్.

“నర్మదా, మన దాంపత్య ప్రయాణాన్ని మొదలు పెట్టటానికి ముందు నీ నుండి నాకు ఒక విషయం తెలియాలి...అఫ్ కోర్స్, అది నీ మంచి గుణం గురించేననుకో...పెళ్ళికి ముందు నేను ఎంత బలవంతం చేసినా నాతో సినిమాకు రానంటే రానన్నావు... ఎందుకు అలా చెప్పావో నాకు తెలుసుకోవాలనుంది”

"పెళ్ళి చూపులకు వచ్చి, మేము నచ్చామని చెప్పి, పెళ్ళి కాయం చేసుకుని, ముహూర్తాలు పెట్టుకున్న తరువాత కొందరు మొగవారు ఏవో కారణాలు చెప్పి పెళ్ళి క్యాన్సిల్ అని చెబుతున్నారు" చెప్పింది నర్మద.

"నేనడిగిందేమిటి...నువ్వు చెప్పేదేమిటి" అన్నాడు మురళి

"మీకు అర్ధమయ్యేటట్టు చెబుతా వినండి. ఆ మధ్య నా స్నేహితురాలికి పెళ్ళి నిశ్చయమయ్యింది. ముహూర్తాలు కూడా పెట్టుకున్నారు. అనుకోకుండా ఒకరోజు ఆమెను పెళ్ళి చేసుకోబోతున్న పెళ్ళికొడుకు ఆమెను సినిమాకు పిలిచాడు. రానని చెబితే ఎక్కడ కోపగించుకుని పెళ్ళి కాన్సిల్ అంటాడేమోనని భయపడి అతనితో సినిమాకు వెళ్ళింది. దాన్ని తప్పుగా చెప్పి పెళ్ళి ఆపేశాడు"

"అవునా?!" ఆశ్చర్యం నటించాడు మురళి.

“అవునండి. నాకు కూడా అదేలాగనే జరిగింది. నన్ను పెళ్ళి చూపుల్లోనే ఓకే చెప్పేసి, ముహూర్తాలు కూడా పెట్టుకున్న తరువాత...ఒక రోజు అతను ఫోన్ చేసి బీచ్ కి వెడదాం రమ్మన్నాడు. పెళ్ళికాబోయే వాడితోనేగా వెళ్ళేది అనుకుంటూ నేనూ వెళ్లాను. అది తప్పుట. పెళ్ళి కాన్సిల్ చేశాడు...అప్పుడు ఒక నిర్ణయానికి వచ్చాను. పెళ్ళి కుదిరినా, ముహూర్తం పెట్టినా...పెళ్ళి చేసుకోబోతున్న మొగాడితో పెళ్ళికి ముందు ఎక్కడికి వెళ్ళ కూడదు. అసలు మాట్లాడనే కూడదు...అందరు మొగవాళ్ళూ అల్లగే ఉంటారని నేనడం లేదు. నా జాగ్రత్తలో నేను ఉండాలి కదా. అందుకే ఆ రోజు మీరొచ్చి ఎంత బ్రతిమిలాడినా రానని చెప్పాను" అన్నది నర్మద.

మురళి ముఖం వాడిపోయింది. తన చేష్టలకు సిగ్గుపడ్డాడు. తప్పు తెలుసుకున్నాడు.




రైలు కుదుపులకి కొంచెం నిద్ర పడుతుందనగా, హలో శేఖరం గారు, పలకరించాడో వ్యక్తి. కొంచెం కళ్ళు తెరిచి చూశాడు శేఖరం. పొడుగ్గా, ఉంగరాల జుట్టుతో, కొంచెం నల్లగా ఎర్ర చొక్కాతో పళ్ళు కనబడేలా నవ్వుతూ ఎదురుగా నించున్నాడో వ్యక్తి.

మీరు? అడిగాడు శేఖరం.

నేను రమణని. మీ శివాపురం అంతా మాయ చిట్ ఫండ్ ఆఫీసు కి ఎప్పుడూ వస్తుండేవాడ్ని కదా సార్.మా బావ వేసిన చిట్ వాయిదా డబ్బులు అప్పుడప్పుడు నేనే వచ్చి మీ ఆఫీసు లో జమ చేసేవాడ్ని.చెప్పాడతను చిన్న నవ్వుతో కళ్లలోకి చూస్తూ.

అతని మాటలకి శేఖరం,కొంచెం ఆలోచించి,నా పేరు,నేను చిట్ ఫండ్ ఆఫీసులో పనిచేస్తున్నానని ,అంతా కరెక్టుగా చెప్తున్నాడంటే తెలిసిన వాడే అయి ఉంటాడు.గుర్తుపట్టలేకపోతే ఏమైనా అనుకుంటాడేమో,అని తనకి తాను సర్ది చెప్పుకుని, ఆ గుర్తొచ్చింది లేవయ్యా.ఈ మధ్య నువ్వు తరుచూ రాకపోయేసరికి గబుక్కున గుర్తుపట్టలేక పోయానంతే.చెప్పాడు చిరునవ్వుతో.

అది సరే సార్. నేను కూడా ఈ మధ్య ఓ పది లక్షల చిట్ ఒకటి వేద్దామనుకుంటున్నాను సార్ .నెలకి ఎంతెంత కట్టాలి .ఒక వేళ మధ్యలో చిటీ పాడేస్తే ఎందరు ప్రభుత్వ ఉద్యోగుల సంతకాలు కావాలి అనే డీటైల్సు అడగడానికి నేనే మీ బ్రాంచికి సోమవారం వస్తాను.చెప్పాడు రమణ.

పది లక్షలా.యాభై వెలకి కమీషన్ రెండు వేలు.అలాంటిది పది లక్షలంటే నలభై వేలు వచ్చేసినట్టే.మనసులో మురిసిపోసాగాడు.

అంతలోనే రమణ ,శేఖరాన్ని ఓ కుదుపు కుదిపి, ప్రస్తుతం లోకి తెచ్చి, సార్ నాకో చిక్కువచ్చిపడింది .ఏం చేయాలో తోచడం లేదు. చెప్పాడు.కాస్త కంగారుగా.

ఇప్పటిదాకా బానేవున్నావ్ కదయ్యా.ఇప్పుడే ఏమైంది.

ఏం లేదు సార్.నా దగ్గర ఓ స్నేహితుడి చెల్లి పెళ్ళికి అందజేయాల్సిన డబ్బు ఉంది.కానీ అది అందించాలంటే నేను నిడదవోలు దిగాలి.అసలే రైలు మూడు గంటలు ఆలస్యంగా నడుస్తోంది.కనుక నేను దిగితే,ఆలశ్యమైపోయి నేను రాబట్టుకోవాల్సిన అప్పు ఒకటి రాబట్టుకోలేక పోవచ్చు.ఎందుకంటే అతను కొద్ది గంటల్లోనే ఉద్యోగ రీత్యా వేరే రాష్ట్రం వెళ్ళిపోతున్నాడు. నేను సమయానికి వెళ్లకపోతే డబ్బు చేతికి రాదు. అపుడు చిట్ కూడా వేయలేను.ఇప్పుడెలా.చేతులు నలుపుకోసాగాడు.

తిరిగి తిరిగి నా చిట్ వేయలేనంటాడేన్టి.సరే తప్పుతుందా.సరేలేవయ్యా.ఎలాగూ నే వెళ్ళాల్సింది తణుకు.ఇదక్కడిచ్చేసి,తర్వాత బస్సులో తణుకు వెళ్తాన్లే. దగ్గరేగా. నీకు అభ్యంతరం లేదంటే చెప్పు,ఆ పెళ్ళిలో నేనే ఆ డబ్బు స్వయంగా అందజేస్తాను.అడ్రెస్ ఇవ్వు చాలు.చెప్పాడు శేఖరం.

ఇదుగోండి. ఈ శుభలేఖలో ఉన్న అడ్రెస్ కి చేరవేయండి చాలు.చెప్పాడతను.

అయినా ,విడ్డూరం! తెలిసిన వాడినైనా,నన్ను మరీ ఇంత గుడ్డిగా నమ్ముతున్నావ్.ఎలాగయ్యా.?

ఏముంది సార్ .ఇందాక ఎవరో రెండువేల నోటు పారేసుకుంటే,ఎవరిది,ఎవరిది అంటూ కనుక్కుని మరీ ఇచ్చారు.మీ మంచితనం నాకు అప్పుడే అర్ధమైంది సార్.

ఆహా.మొత్తానికి ఘటికుడివేనయ్యోవ్, అంటూ అతని బుజం తట్టి, అతను ఇచ్చిన అడ్రెస్ తీసుకున్నాడు శేఖరం.ఆ తర్వాత ఆ అడ్రెస్ కి వెళ్ళాడు.అంతా పచ్చ తోరణాలు.వైభవంగా ముస్తాబైన పెళ్లి పందిరి.జనంతో హడావుడిగా ఉంది.ఎటు వెళ్లాలో

తెలియక ఓ సారి చుట్టూ కలియజూస్తుండగానే ,ఓ వ్యక్తి పరుగు లాంటి నడకతో చక,చకా వచ్చి ,శేఖరం చేతిలోని బ్యాగ్ వైపే చూస్తూ ,సార్ ఈ,ఈ బ్యాగు అంటూ మాట తడబడ్డాడు.

మీ అడ్రెస్ ఉన్న శుభలేఖ ఇచ్చి ఇక్కడికి పంపాడు సార్ మీ స్నేహితుడు.చెప్పాడు శేఖరం.

నా స్నేహితుడా? ఈ డబ్బు నాదే సార్.నిన్ననే రైల్లో పోగొట్టుకున్నాను.ఏది ఏమైనా ఇపుడు నాకు చాలా సంతోషంగా ఉంది సార్ .సమయానికి మా చెల్లెలి పెళ్లి ఆగి పోకుండా కాపాడారు.మీ రుణం తీర్చుకోలేం.చెప్పాడతను.

అతను మీ స్నేహితుడు కాదా! అసలు ఏం జరిగింది.ఈ డబ్బు ఇచ్చినతను తన పేరు రమణ అని చెప్పాడు.అతనెవరో మీకు తెలిదా.అడిగాడు చాలా ఆశ్చర్యంగా .

తెలిదు సార్.అసలు జరిగిందేవిటంటే ,నేను నిన్న రాజమండ్రి బ్యాంక్ లో బంగారం తాకట్టు పెట్టి,తెలిసిన స్నేహితుడి ధగ్గర కూడా కొంత మొత్తం అప్పు చేశాను.మొత్తం అయిదు లక్షలు తీసుకొస్తుండగా,ఎవరో ఎత్తుగా,నల్లగా ,ఉంగరాల జుట్టుతో ఉన్నవాడు నా పేరు తో నన్ను పిలిచి, నేను తెలుసని చెప్తే ,నిజమే అనుకున్నాను.మాట కలిపి,నన్ను మంచి చేసుకుని, తినమని ఏదో ప్రసాదం అని నా చేతిలో పెట్టాడు . కొంచెం నిద్ర పట్టేసరికి నా బ్యాగ్ కొట్టేశాడు వెధవ.తర్వాత ఆలోచించి చూస్తే, నా పర్సు కొట్టేసి, అందులో ఉన్న ఆధార్ కార్డు చూసి, నా పేరు, వివరాలు తెలుసుకుని నన్ను పరిచయం చేసుకున్నాడని అర్ధమైంది. అలాగే , ఆ కొట్టేసిన వాడు,ఎవరికైనా భయపడి వదిలేశాడో ,లేక ఆ జనం రద్దీలో పారేసుకున్నాడో గాని, నే బంగారం తాకట్టు పెట్టిన రిసీప్టూ ,శుభలేఖ కూడా అందులో ఉండడం చేత ,ఈ బ్యాగ్ దొరికినతను , దేవుడిలా మీకు ఈ బ్యాగ్ ఇచ్చి,నా స్నేహితుడని చెప్పి మిమ్మల్ని ఇక్కడికి పంపించుంటాడు. నిజంగా ఆయనిది దొడ్డ మనసు.చెప్పాడు చిన్న కన్నీటి పొరతో.

అతని మాటలు విన్న శేఖరం ఓ క్షణం ఆలోచన్లో పడ్డాడు.ఎత్తుగా ,నల్లగా ,ఉంగరాల జుట్టుతో ఉన్నవాడు, పేరు పిలిచి పరిచయం చేసుకున్నాడా ?నాకు ఈ బ్యాగ్ ఇచ్చిన వాడు కూడా పోలికల్లో అలానే ఉన్నాడు.పైగా నన్ను కూడా అచ్చం అలానే పేరు పిలిచి, వృత్తి వివరాలు చెప్పి పరిచయం చేసుకున్నాడు.అంటే నిన్న దొంగిలించిన దొంగే, అందులో తాకట్టు రసీదూ ,శుభలేఖ చూసి ఆడ కూతిరి పెళ్లి ఖర్చుల డబ్బు అని తెలిసి ,దొంగైనా ,దొడ్డ మనసుతో నాతో ఈ బ్యాగ్ ఇక్కడికి చేరేలా చేసాడన్నమాట. మరి నా వివరాలు ఎలా తెలిసాయి! అనుకుంటూ జేబు తడుముకున్నాడు .పర్సు లేదు.అంటే, పర్సులో నా విసిటింగ్ కార్డు చూసి,నేను ఫలానా అని తెలుసుకున్నాడన్నమాట.

నేను ఊహించిందే నిజం. రూఢీ చేసుకున్నాడు శేఖరం.అంతలోనే ,సార్ మా చెల్లెల్ని దీవించండి అంటూ అక్షింతలు చేతిలో పెట్టాడతను.పర్సు పోగొట్టుకున్నా ,ఓ మంచి పని చేయడంలో సహాయపడినందుకు గాను, తృప్తి ,ఆనందం నిండిన మనసుతో ,ఆమెపై అక్షింతలు వేసి ఆశీర్వదించాడు శేఖరం.